# రోడ్డు పనులు ప్రారంభించేది ఎప్పుడు?



**మెదక్ జిల్లా వుదయం**

నిజాంపేట మండల పరిధిలోని చల్మెడ కమాన్ నుంచి నందగోకుల్ గ్రామం వరకు దాంబర్ రోడ్డు పనులు ఎప్పుడు ప్రారంభిస్తారని గ్రామస్తులు ప్రశ్నిస్తు న్నారు.రోడ్డు పనులు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి పాదయాత్ర చేపట్టి 15 రోజులు గడుస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం పట్ల గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అధ్వానంగా ఉన్న రహదారితో నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వాహనదా రులు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఇకనైనా సంబంధిత అధికా రులు చొరవ తీసుకుని రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# అప్పుల బాధతో యాసిడ్ తాగి వ్యక్తి మృతి



**తిమ్మాజీపేట, సెప్టెంబర్ 12 (వుదయం ప్రతినిధి):**

మండలంలోని గుమ్మకొండ తండాకు చెందిన పాత్లావత్ సక్రు నాయక్ (42) అప్పుల బాధతో యాసిడ్ తాగి మృతి చెందారు.స్థానికుల వివరాల ప్రకారం.. సక్రుకు రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. అప్పు చేసి పౌల్ట్రీ ఫామ్ నిర్మించ గా, వ్యాధుల కారణంగా సుమారు 10 వేల కోళ్లు మృతి చెందడంతో తీవ్రంగా నష్టపోయారు. సాగునీటి కోసం వేసిన రెండు బోర్లలోనూ నీరు పడకపోవడం తో అప్పులు పెరిగి ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారు. ఈ క్రమంలోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శిగా దొమ్మట రాజు



**మెదక్ జిల్లా వుదయం**

నిజాంపేట మండలం తిప్పనగుల్ల గ్రా మానికి చెందిన దొమ్మట రాజును ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శిగా నియమించా రు. ఈ మేరకు రాష్ట్ర కార్యదర్శి ప్రణీత చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దొమ్మట రాజు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లా కార్యదర్శి పదవి అప్పగించినం దుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రానున్న రోజుల్లో పార్టీకి కట్టుబడి, పార్టీ బలోపేతం కోసం శక్తివంచన లేకుండా పనిచేస్తానని అన్నారు.

# రాజీమార్గంతో కేసుల త్వరిత పరిష్కారం



**జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 8,486 కేసులకు పరిష్కారం**
**రూ.1.43 కోట్లకుపైగా నగదు లావాదేవీలకు ముగింపు**

**గద్వాల, సెప్టెంబర్ 12 (వుదయం కరస్పాండెంట్)**

ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసులను కక్షిదారుల పరస్పర సమ్మతి తో రాజీమార్గంలో త్వరితగతిన పరిష్క రించుకోవచ్చని జిల్లా న్యాయమూర్తి కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం గద్వాల కోర్టు ఆవ రణలో జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించారు.
ఈ సందర్భంగా వివిధ విభాగాలకు చెందిన 8,486 కేసులను రాజీమార్గం లో పరిష్కరించినట్లు జిల్లా న్యాయమూ ర్తి తెలిపారు. ఈ కేసులకు సంబంధించి మొత్తం రూ.1,43,60,970 విలువైన నగదు లావాదేవీలను పరిష్కరించి నట్లు వెల్లడించారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించుకోవడం వల్ల సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు ఇరుపక్షాలకు సత్వర న్యాయం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రజలు లోక్ అదాలత్ సేవలను సద్వినియోగం చేసు కోవాలని సూచించారు.
కార్యక్రమంలో పోక్సో న్యాయమూర్తి శ్రీ నివాస్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి నాగరాజు, కార్యదర్శి నిష్మా పాత్రుడు, ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వెంకటేష్ దుర్వా, డీఎస్పీ మొగుల య్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్, న్యాయవాదులు, కక్షిదారు లు, న్యాయశాఖ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఉత్తర నక్షత్ర వేడుకల్లో అయ్యప్ప నామస్మరణ

**12 గంటలపాటు అఖండ భజన. భక్తులతో మార్మోగిన తాండూర్ అయ్యప్ప ఆలయం**

**తాండూర్ సెప్టెంబర్ 12 (వుదయం ప్రతినిధి)**



ఉత్తర నక్షత్రం సందర్భంగా తాండూర్ అయ్యప్ప ఆలయంలో శనివారం ఆధ్యా త్మిక సందడి నెలకొంది. ఆలయ కమిటీ తాండూర్ ఆధ్వర్యంలో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించిన అఖండ భజన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది. అయ్యప్ప స్వామి నామస్మర ణలు, భక్తిగీతాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భజన కార్యక్రమంలో భక్తిపారవశ్యం తో గడిపారు. ఉదయం ప్రారంభమైన భజన సాయంత్రం వరకు నిరంతరా యంగా కొనసాగడంతో ఆలయ ప్రాం గణమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు స్వామివారిని దర్శిం చుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జాతీయ వ్యవస్థా పకులు రాజ్ దేశ్‌పాండే అయ్యప్ప పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన అయ్యప్ప భక్తి, దీక్ష, ఆధ్యాత్మిక జీవన విధానం విశిష్ట తను వివరించారు. అయ్యప్ప స్వామి అనుగ్రహంతో ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖశాంతులు, సౌభాగ్యం నెలకొనాల ని ఆకాంక్షించారు.ఉత్తర నక్షత్రం సంద ర్భంగా నిర్వహించిన ఈ అఖండ భజన కార్యక్రమం భక్తుల్లో ఐక్యత, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించేలా సాగింది. కార్యక్రమానికి సహకరించిన అయ్యప్ప భక్తులు, దీక్షాస్వాములు, ఆలయ కమిటీ సభ్యులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వికారా బాద్ జిల్లా గౌరవ అధ్యక్షులు గాజుల బసవరాజ్ తాండూరు అయ్యప్ప స్వామి దేవాలయ కమిటీ సభ్యులు, తాండూరు పట్టణ తాండూరు సమీపంలోని అయ్య ప్ప భక్తులు పాల్గొన్నారు.

# సదాశివపేటలో ఘనంగా సత్సంగం ముగింపు కార్యక్రమం

**సదాశివపేట:వుదయం**



శ్రావణమాసాన్ని పురస్కరించుకుని సదాశివపేట వీరశైవ లింగాయత్ సమాజం ఆధ్వర్యంలో ఎడ్ల బజారులో బసవేశ్వర మందిరం లో పెద్దలు శివశ్రీ నల్ల బసవరాజ్ సార్ ఏర్పాటు చేసిన నెల రోజుల సత్సంగ కార్యక్రమం శుక్ర వారం భక్తిశ్రద్ధలతో ముగిసింది.
ఈ సందర్భంగా సమాజ అధ్యక్షులు గందిగా రాజు మాట్లాడుతూ.. శివశ్రీ నల్ల బసవరాజ్ సార్ రచించిన 'సూక్ష్మ శరీరం' పుస్తకంలోని ఆధ్యాత్మిక విష యాలను నెల రోజుల పాటు ప్రతిరోజూ సత్సంగం ద్వారా భక్తులకు వివరించ డం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఆధ్యాత్మిక చింతన, సద్గురువుల బోధనలు, భక్తి మార్గం, సమాజ సేవ వంటి అంశాలపై అవగాహన కలిగిం దన్నారు.సత్సంగంలో పాల్గొన్న వక్తలు ఆధ్యాత్మిక జీవన విధానం, సద్గురువుల బోధనలు, భక్తి మార్గం, సమాజ సేవ యొక్క ప్రాధాన్యతను వివరించారు. భక్తి, ధర్మం, సత్యం, సేవా భావాలను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఆచ రించాలని పిలుపునిచ్చారు.సమాజ కార్యనిర్వాహక అధ్యక్షులు అన్మిశెట్టి జయప్రకాష్ మాట్లాడుతూ.. పెద్దలు శివశ్రీ నల్ల బసవరాజ్ సార్ మన సమాజ సభ్యులుగా ఉండటం మనం దరికీ గర్వకారణమన్నారు. గత కొంత కాలంగా వారు నిరంతరం ఆధ్యాత్మిక సత్సంగ కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెం పొందిస్తున్నారని తెలిపారు. ఈసారి బసవేశ్వర మందిరంలో 30 రోజుల పాటు ఏకధాటిగా 'సూక్ష్మ శరీరం' పుస్తకంలోని అంశాలతో పాటు భగవ ద్గీతలోని శ్లోకాలపై వివరణ ఇవ్వడం అభినందనీయమన్నారు.వక్తలు తేదీల్ బసవరాజ్, సిద్ధికేరి లోకేష్ మాట్లాడు తూ.. నెల రోజుల పాటు ప్రతిరోజూ సత్సంగ కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో స్ఫూర్తిదాయకమని, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను, ధార్మిక చైతన్యాన్ని పెంపొం దిస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో కార్యనిర్వహక అధ్య క్షులు అన్మిశెట్టి జయప్రకాశ్, కోశాధికా రి అమరాధి రాచన్న, సమాజ సభ్యులు, బసవరాజు,సిందోల్ రవి, దేశెట్టి శేఖర్, షాబాద్ వీరన్న,వస్కర్ అంజప్ప, లోకేష్,మల్లు,సాయిబాబా, కృష్ణ, విట్టల్ రెడ్డి, హనుమంతరావు, కుమార్ గౌడ్ రాములు బీంరావ్,సమాజ సభ్యులు వీరశైవ లింగాయత్ మహిళా విభాగం సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సత్సంగం ముగింపు కార్యక్రమాన్ని విజ యవంతం చేశారు.

# రైతు తండ్రి జీవిత పోరాటానికి అక్షర రూపం

*** 'జిద్దు' కవితలో కష్టం, త్యాగం, ప్రేమను ఆవిష్కరించిన కవి చెన్న రాజు**

**దౌల్తాబాద్ సెప్టెంబర్ 12( వుదయం):**



రైతు జీవితం అంటేనే నిరంతర పోరాటం.. ప్రకృతి ప్రతికూలించినా, కరువు కాటేసినా, అప్పులు వెంటాడినా వెనుకడుగు వేయకుండా నేలను నమ్ముకుని సాగిపోయే అన్నదాత జీవన విధానాన్ని హృద్యంగా ఆవిష్కరించారు కవి, ఉపాధ్యాయుడు చెన్న రాజు. తండ్రి కష్టాన్ని, త్యాగాన్ని, పిల్లలపై ఆయన చూపిన అపారమైన ప్రేమను వివరిస్తూ రచించిన 'జిద్దు' కవిత పాఠకులను కదిలించేలా ఉంది.ఎడ్లతోనే స్నేహంగా మెలుగుతూ.. ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటూ.. ఆరాటం కంటే పోరా టాన్నే నమ్ముకుని ముందుకు సాగే రైతు తండ్రి జీవితాన్ని కవి తనదైన శైలిలో చిత్రించారు. ఎండా, వానా, కరువా, కష్టమా.. ఏది ఎదురైనా వ్యవసాయా న్ని వదలకుండా మట్టితోనే పోరాడిన తండ్రి జీవితాన్ని అక్షరాల్లో ఆవిష్కరిం చారు.ఆకలి, ఉపవాసాలు ఎదురైనా కుటుంబం కోసం వెనుకడుగు వేయని తండ్రి.. పిల్లలకు మంచి భవిష్యత్తు అం దించేందుకు తన సుఖాలను త్యాగం చేసిన వైనాన్ని కవితలో చక్కగా వివరిం చారు. పండుగ రోజుల్లోనూ పిల్లలకు మంచి బట్టలు, కూర అందించి.. తాను మాత్రం పాత బట్టలతోనే సరిపెట్టుకు న్న తండ్రి త్యాగాన్ని కవి హృదయానికి హత్తుకునేలా మలిచారు.
చిన్నచిన్న అడుగులతో పిల్లలకు నడక నేర్పిన ఓర్పు నుంచి.. బురదలో ఆవులతో కలిసి వ్యవసాయం చేసిన అనుభవం వరకు తండ్రి జీవితంలోని ప్రతి మలుపును కవితలో ప్రతిబింబిం చారు. అప్పులు, ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఉన్నా కుటుంబాన్ని సాదుకుంటూ, ఒక్క పూట కష్టపడి ఎన్నో పూటల కు టుంబానికి అన్నం పెట్టిన తండ్రి గొప్ప తనాన్ని చాటారు.

**తండ్రి ప్రేమకు అక్షర నివాళి**

''నా వల్ల ఏదైనా మంచి జరిగితే మీరు నేర్పిన అలవాటు.. ఏదైనా చెడు జరిగితే నేను చేసిన పొరపాటు'' అంటూ తండ్రి తన జీవితంపై చూపిన ప్రభావాన్ని కవి వ్యక్తీకరించారు. తండ్రి రెక్కల కష్టం విలువ తెలిసే సమయానికి ఆయన దూరమైపోయిన బాధను కవిత చివరి భాగంలో హృద్యంగా వ్యక్తం చేశారు.
దేవులాడినా దొరకని ప్రేమ.. వెతికినా లభించని ఆప్యాయత.. ఏ పుస్తకం చదివినా దొరకని ధైర్యం తండ్రి నుంచి లభిస్తుందనే భావాన్ని కవి చక్కగా ఆవి ష్కరించారు. జీవితం అంటే కష్టాలను ఎదుర్కొంటూ పట్టుదలతో బతకడమేన ని నేర్పిన తండ్రికి 'జిద్దు' కవితను అక్షర నివాళిగా మలిచారు.కవి, ఉపాధ్యా యుడు చెన్న రాజు రచించిన ఈ కవిత రైతు తండ్రుల జీవితాల్లోని కష్టాలు, త్యాగాలు, ప్రేమను గుర్తుచేస్తూ పాఠకుల మనసులను హత్తుకునేలా ఉంది.

# కట్నం వేధింపులు భరించలేక మహిళ ఆత్మహత్యాయత్నం

**చికిత్స పొందుతూ మృతి**
**నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు**

**తాండూర్ సెప్టెంబర్ 12 (వుదయంప్రతినిధి)**

కట్నం కోసం భర్త వేధింపులు భరించ లేక ఓ వివాహిత కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్న ఘటనలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన కరెంటు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కరణ్ కోట్ ఎస్సై వినోద్ రాథోడ్ తెలిపిన వివరాలు కొరివి గ్రామానికి చెందిన బేగంబి భర్త ఇస్మా యిల్ సాబ్ తన రెండవ కుమార్తె రేష్మ బేగం (27)ను తాండూర్ మండలం సంగం కలాం గ్రామానికి చెందిన మస్తాన్ (32), తండ్రి అన్మోమియాకు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు.
గత కొంతకాలంగా మస్తాన్ డబ్బుల కోసం రేష్మ బేగంను, ఆమె కుటుంబ సభ్యులను వేధిస్తున్నట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఒకసారి డబ్బులు ఇచ్చినప్పటికీ, మరోసారి డబ్బులు ఇవ్వకపోవడంతో రేష్మను శా రీరకంగా, మానసికంగా వేధించినట్లు తెలిపారు.
ఈ వేధింపులు భరించలేక ఈ నెల 7న రాత్రి సుమారు 9 గంటల సమయంలో



రేష్మ బేగం తన శరీరంపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గమ నించిన స్థానికులు ఆమెను చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించా రు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు గుల్బర్గా లోని మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించారు.
అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 11న సాయంత్రం సుమారు 5.30 గంటలకు రేష్మ బేగం మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు . ఈ కేసులో నిందితుడైన మస్తాన్‌ను శనివారం అదుపులోకి తీసుకుని, న్యాయస్థానంలో హాజరుపరి చి రిమాండ్‌కు తరలించినట్లుతెలిపారు.




# రాజకీయ విలువలను దిగజారుస్తున్న అధికార, ప్రతిపక్ష పార్టీల

**నాగర్ కర్నూల్, సెప్టెంబర్ 12 (వుదయం బ్యూరో):**

గత వారం రోజులుగా రాష్ట్రంలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల వైఖరితో రాజకీయ హైడ్రామా నడుస్తోందని, హుందాగా ఉండాల్సిన ఈ రెండు పార్టీలు రాజకీయ సంప్రదా యాలను మంటగలుపుతున్నాయని సీపీఐ జాతీయ నాయకులు, మాజీ శాసనసభ పక్ష నేత చాడా వెంకటరెడ్డి విమర్శించారు.
శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత రాజకీయ వ్యవహారాల వల్ల యువత రాజకీయాల్లోకి రావాలనే ఆసక్తి తగ్గు తోందన్నారు. ప్రజల సొమ్ముతో నడిచే అసెంబ్లీ సమావేశాలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం జరగాల్సి ఉండగా, వ్యక్తిగత దూషణలు, బూతులతో నిండి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరు ఎక్కువ తిడితే వారే గొప్ప అనే భావనలో రెండు పార్టీలు ఉన్నాయని, ఇది ప్రమాదకరమన్నారు.త్వరలో జి ల్లాలోని పెండింగ్ ప్రాజెక్టుల పనులు ప్రారంభించేలా సీపీఐ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ విలీన దినాన్ని అధికారికంగా నిర్వహించాలని, 4500 మంది అమరవీరుల త్యాగాన్ని, 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన చరిత్రను ప్రభుత్వం గుర్తిం చాలని డిమాండ్ చేశారు. మహారాష్ట్ర, కర్ణాటక ప్రభుత్వాలు అధికారికంగా ని ర్వహిస్తుండగా, తెలంగాణలో ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు.ఈ విలేకరుల సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.ఎం.డి. ఫయాజ్, రాష్ట్ర నాయకులు హెచ్. ఆనంద్, కె. కేశవులు గౌడ్, మహబూబ్ నగర్ జిల్లా కార్యదర్శి బాలకిషన్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఈర్ల చంద్రమౌళి, పి. పరమేష్ గౌడ్, ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, జిల్లా సమితి సభ్యులు బండి లక్ష్మీపతి, మారేడు శివశంకర్, తన్నీరు మల్లయ్య, పర్వతాలు, వెంకట స్వామి తదితరులు పాల్గొన్నారు.

# రాజి మార్గంతో రాజమార్గం

**మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి,**

**నారాయణఖేడ్ సెప్టెంబర్ 12(వుదయం)**



నారాయణఖేడ్ పట్టణంలోని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి ఎం హిమబిందు సమక్షంలో నిర్వహించారు. ఈ సం దర్భంగా వివిధ కేసులను కక్షిదారుల పరస్పర అంగీకారంతో రాజీమార్గంలో పరిష్కరించారు. మొత్తం 574 కేసులు రాజీ ద్వారా పరిష్కారమైనట్లు జడ్జి ఎం. హిమబిందు తెలిపారు. కేసుల పరిష్కా రానికి కక్షిదారులు పరస్పర అవగాహ నతో ముందుకు రావాలని, సమయం, ఖర్చు ఆదా చేసుకుని త్వరితగతిన న్యాయం పొందేందుకు లోక్ అదాలత్ మంచి వేదిక అని పేర్కొన్నారు. ప్రజల కు సులభంగా, త్వరగా న్యాయం అం దించాలనే ఉద్దేశంతో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్ రెడ్డి, సీఐలు శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సబ్ డివిజన్ ఎస్సైలు, కోర్టు కానిస్టేబుళ్లు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కులం గజ్జితో కక్షసాధింపా..!



**కులాంతర వివాహం చేసుకున్న దంపతులపై దాడి ఆరోపణలు**
**దళిత యువకుడి ఇంటిని ధ్వంసం చేశారంటూ ఆవేదన.. నిలువనీడ లేకుండా చేశారని బాధితుల ఆరోపణ**
**దాడులకు పాల్పడిన వారిపై ఉక్కుపాదం మోపాలి: ధర్మ సమాజ్ పార్టీ**

**గద్వాల సెప్టెంబర్ 12 (వుదయం బ్యూరో)**

ప్రేమకు కులం అడ్డుకాదని చాటి కులాంతర వివాహం చేసుకున్న దంప తులపై దాడి జరిగిందన్న ఆరోపణలు జోగులాంబ గద్వాల జిల్లాలో తీవ్ర కలకలం రేపుతున్నాయి. రేపల్లె గ్రా మానికి చెందిన దళిత వర్గ యువకుడు రంగముని, బీసీ వర్గానికి చెందిన ఈనేశ్వరి ప్రేమ వివాహం చేసుకున్న నేపథ్యంలో కొంతమంది వ్యక్తులు వారిపై, వారి కుటుంబ సభ్యులపై దాడికి పాల్పడ్డారని ఆరోపణలు వెల్లువెత్తా యి. బాధితుల ఆరోపణల ప్రకారం.. కుటుంబ సభ్యులపై దాడి చేయడంతో పాటు రంగముని ఇంటిపై కూడా దాడి చేసి తలుపులు, ఇంటి సామగ్రిని ధ్వంసం చేశారని తెలిపారు. ఇంటిని ధ్వంసం చేయడంతో కుటుంబం నిలు వనీడ లేకుండా తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు.
కులం పేరుతో కక్ష సాధిస్తే చూస్తూ ఊరుకోం
కులాంతర వివాహం చేసుకున్నందుకు ఒక కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని దాడి చేయడం జరిగిందన్న ఆరోపణ లు అత్యంత ఆందోళనకరమని ధర్మ సమాజ్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. కుల వివక్ష, కుల ఆధారిత వేధింపులు, దాడులను ఏ మాత్రం సహించబోమని స్పష్టం చేశారు. ఘటనపై తక్షణమే సమగ్ర దర్యాప్తు చేపట్టి, దాడికి పాల్ప డినట్లు ఆధారాలతో తేలిన వారిపై ఎలాంటి రాజకీయ లేదా సామాజిక ఒత్తిళ్లకు తలొగ్గకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధితులకు భద్రత.. ధ్వంసమైన ఇంటికి న్యాయం బాధిత దంపతులు, వారి కుటుంబ సభ్యులకు తక్షణ రక్షణ కల్పించాలని నాయకులు కోరారు. ధ్వంసమైన ఇంటిని అధికారు లు పరిశీలించి బాధిత కుటుంబానికి అవసరమైన సహాయం అందించా లని డిమాండ్ చేశారు. కులాంతర వివాహం చేసుకున్న జంటలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేన ని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. న్యాయం జరిగే వరకు వెనక్కి తగ్గం' ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నరేష్ మహారాజ్ మాట్లాడుతూ.. బాధిత కుటుంబాని కి సంపూర్ణ న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఘటనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని, బాధ్యులపై చట్టప రమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
మాదిగ జాగృతి సంఘం నాయకులు కూడా ఘటనను తీవ్రంగా ఖండించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని, న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని భరోసా ఇచ్చారు. సర్కారు స్పందించక పోతే రాష్ట్రస్థాయి పోరు
బాధిత కుటుంబానికి న్యాయం జరగ కపోతే ఉద్యమాన్ని రాష్ట్రస్థాయికి తీసు కెళ్తామని నాయకులు హెచ్చరించారు. రాష్ట్రస్థాయి నాయకులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రకటించారు. కులం ఏదైనా..ప్రేమ వివాహం చేసుకున్నందు కు ఒక కుటుంబంపై దాడి జరిగిందన్న ఆరోపణలు నిజమైతే, అది సమాజానికే అవమానం. బాధితులకు న్యాయం చేయడం, దోషులుగా తేలిన వారిపై చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడం ప్ర భుత్వ బాధ్యత'' అని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కె. నరేష్, బి. నరేష్, కిషోర్, నాగార్జున్, సురేందర్, జె. నరేష్, కృష్ణంరాజ్, శేఖర్, శ్రీనివాసులు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# లోక్ అదాలత్ తో కేసులకు సత్వర పరిష్కారం

**నాగర్ కర్నూల్, సెప్టెంబర్ 12 (వుదయం ప్రతినిధి):**




రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యం లో శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, డీఎల్ఎస్ఏ చైర్మన్ డి. రమాకాంత్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని కోర్టుల్లో లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భూతగాదాలు, రాజీ చేసుకోదగిన క్రిమిన ల్ కేసులు, చెక్ బౌన్స్, కుటుంబ, మోటారు వాహన ప్రమాదాలు, బ్యాంకు తదితర పెండింగ్ కేసులను పరిష్కరించుకోవచ్చ న్నారు. లోక్ అదాలత్ తో సమయం, డబ్బు ఆదా కావడంతో పాటు అప్పీల్ లేని తీర్పు లభిస్తుందని పేర్కొన్నారు.పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి నసీం సుల్తానా మాట్లాడు తూ.. పగలు, ప్రతీకారాలకు దూరంగా రాజీ చేసుకోవడం ద్వారా మానవ సంబంధాలు బలపడతాయన్నారు. డీఎ ల్ఎస్ఏ కార్యదర్శి నిహారిక మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగకుండా కేసులను త్వరగా పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ చక్కటి అవకాశమన్నారు .ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి గోపిక నాగశ్రావ్య, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శృతి దూత, డీఎస్పీ బుర్రి శ్రీని వాసులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవికాంత్ రావు, కార్యదర్శి పర్వత్ రెడ్డి, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు

# అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ లో ఫ్రంట్ లైన్ సిబ్బందికి రక్షణ కిట్ల పంపిణీ

**అచ్చంపేట, సెప్టెంబర్ 12 (వుదయం ప్రతినిధి):**



అటవీ, వన్యప్రాణుల సంరక్షణలో ముందుండి విధులు నిర్వహిస్తున్న ఫ్రంట్ లైన్ సిబ్బంది భద్రత, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.
హైదరాబాద్ కు చెందిన UST సాఫ్ట్ వేర్ కంపెనీ CSR లో భాగంగా టైగర్ రిజర్వ్ పరిధిలో పనిచేస్తున్న 170 మంది బేస్ క్యాంప్ వాచర్లు, యానిమల్ ట్రాక ర్లు, పేపర్ పికర్స్ కు షూస్, బిల్ హుక్స్, జాకెట్లు తదితర రక్షణ సామగ్రితో కూడిన కిట్లను పంపిణీ చేశారు. అనే సందేశంతో చేపట్టిన ఈ కార్యక్ర మంలో అడవుల్లో ప్రతికూల పరిస్థితుల్లో పనిచేసే సిబ్బందికి ఈ సామగ్రి ఎంతో ఉప యోగకరమని, UST సంస్థ సహకారం అభినందనీయమని అధికారులు పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి రేవంత్ చంద్ర, IFS, ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ యశ్ చంద్ర ప్రకాశ్ సింఘాల్, IFS, ఏసీఎఫ్ చంద్రశేఖర్, రేంజ్ అధికారులు, ఇతర అటవీ శాఖ సిబ్బంది, UST CSR ప్రతినిధులు మదన్ రెడ్డి, విశాల్ దయాపులే, శ్రీనాథ్ అల్లినేని, సందీప్ కొండపాక, అంకిత్ కుమార్. తది తరులు పాల్గొన్నారు

# దళిత స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు

**కెసిఆర్ అసెంబ్లీకి వచ్చి ప్రజల సమస్యలపై మాట్లాడాలి**
**కాంగ్రెస్ నేతల డిమాండ్**

**నారాయణపేట టౌన్ సెప్టెంబర్ 12(వుదయం ప్రతినిధి)**



శాసనసభ స్పీకర్ గడ్డం.ప్రసాద్ కుమార్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థను, రాజ్యాంగబద్ధ పదవిని అవమానించ డమేనని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. రాజకీయాల్లో విమర్శలు సహజమేనని, అయితే వ్యక్తిగత దూషణలు, రాజ్యాంగ పదవులను కించపరిచే వ్యాఖ్యలు చేయడం సరి కాదని స్పష్టం చేశారు. నారాయ ణపేట జిల్లా కేంద్రంలోని సివిఆర్ భవన్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతిని ధి డాక్టర్ లోకేష్ యాదవ్,కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి, మాజీ డీసీసీ అధ్యక్షులు కుంభం.శివకుమార్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు కె. ప్రశాంత్ కుమార్ రెడ్డి లు మాట్లాడారు.రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ లోకేష్ యాదవ్ మా ట్లాడుతూ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా ఖండించాల్సిన వి షయమన్నారు. **కుంభం శివకుమార్ రెడ్డి మాట్లాడుతూ...**
భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు పూర్తవుతున్నా సమానత్వం కోసం ఇంకా పోరాడా ల్సిన పరిస్థితి రావడం బాధాకరమన్నా రు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నాయక త్వంలో రూపొందిన రాజ్యాంగం కుల, మత, ప్రాంత భేదాలకు అతీతంగా ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిం దన్నారు. దేశంలో అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా జీవించాలన్నదే రాజ్యాంగ స్ఫూర్తి అని తెలిపారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నాయకుల వయస్సు కు, హోదాకు గౌరవం ఇవ్వకుండా వ్యక్తిగత విమర్శలు చేయడం సరికా దన్నారు. అసెంబ్లీ, శాసన మండలి వంటి రాజ్యాంగ సంస్థల్లో రాజకీయ హుందాతనం, క్రమశిక్షణ పాటించా లని సూచించారు. రాజకీయ కక్షలు, వ్యక్తిగత దూషణలకు స్వస్తి పలికి ప్రజా సమస్యలు, తెలంగాణ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని కోరారు.

**డీసీసీ అధ్యక్షులు కె.ప్రశాంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ...**

ప్రతిపక్ష నేత కేసీఆర్‌కు తెలంగాణ ప్రజల సమస్యలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీకి వచ్చి ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. ఫామ్ హౌస్ లో ఉంటూ వారిపార్టీ కి చెందిన ఎమ్మెల్యే,యమ్మెల్సీ లతో రెచ్చ గొట్టే విధంగా కుట్రలు చేయడం మానుకోవాలన్నారు.దళి తులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ దళితుల సోదరులు ఫామ్ హౌస్ ముట్టడి చేస్తే పసుపు నీళ్లు చల్లి శుద్ధికరణ చేయడం హేయమైన చర్య అన్నారు.తెలంగాణ ప్రజలు మళ్లీ పాత పాలన కోరుకోవడం లేదు.. అభివృద్ధి, సంక్షేమం, ప్రజా పాలన కోరుకుంటు న్నారు అని స్పష్టం చేశారు. తెలంగా ణను రాజకీయ కలహాలకు వేదికగా కాకుండా అభివృద్ధి దిశగా నడిపిం చేందుకు కాంగ్రెస్ పార్టీ ముందుం టుందని కె. ప్రశాంత్ కుమార్ రెడ్డి అన్నారు.ఈ సమావేశంలో మార్కెట్ చైర్మన్ శివారెడ్డి,జిల్లా ప్రధాన కార్య దర్శి ఎండి. సలీం, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్లు బండి. వేణుగోపాల్, సరఫ్ నాగరాజ్, జి. సుధాకర్, మండల, పట్టణ అధ్యక్షులు కోట్ల. రవీందర్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, ఓబిసి జిల్లా అధ్యక్షులు గొల్ల కృష్ణయ్య,కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎండి. గౌస్, ఎన్ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షులు ఎండి. అఫ్రోజ్ బోయ శరణప్ప,శ్రీనివాస్ రెడ్డి,కౌన్సిలర్ రాజేష్ ఘాట్, మాజీ కౌన్సిలర్ ఆమిరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి




**- ఆన్‌లైన్‌లో మండపాల వివరాలు నమోదు చేసుకోవాలి**
**- ప్రజా రవాణాకు, అత్యవసర సేవలకు ఆటంకం కలగకుండా మండపాల ఏర్పాటు**
**- డీజేలు, మద్యం, జూదం, అసభ్య కార్యక్రమాలకు పూర్తిగా దూరంగా ఉండాలి**
**- మేడిపల్లి సీఐ డి.జలంధర్ రెడ్డి**

**మేడిపల్లి**
**వుదయం ప్రతినిధి సెప్టెంబర్ 11**

గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖ సూచించిన నిబంధనలు, భద్రతా చర్యల ను తప్పనిసరిగా పాటించాలని మేడిపల్లి సీఐ డి.జలంధర్ రెడ్డి అన్నారు.శుక్రవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ..... పలు విషయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా మేడిపల్లి సిఐ డి.జలంధర్ రెడ్డి మాట్లాడుతూ....గణేష్ మండపాల నిర్వహణకు సంబంధించిన వివరాలను పోలీస్ శాఖ రూపొందించిన ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. గణేష్ మండపాల వివరాలను నమోదు చేసే విధానం కేవలం మండపాల నిర్వహణకు సంబంధించిన సమాచారం సేకరించడం, భద్రత, బందోబస్తు ఏర్పాట్లను సులభతరం చేయడం కోసమేనని, ఇందుకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని సీఐ స్పష్టం చేశారు. మండపాలు ఏర్పాటు చేసే ముందు నిర్వాహకులు ముందస్తుగా పోలీసుల కు సమాచారం అందించడంతో పాటు ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు."గణేష్ మండపం ఆన్‌లైన్ నమోదు పోర్టల్" https://policeportal.tspolice.gov.in/userverifcn.htm ద్వారా వివరాలు నమోదు చేసి, సంబంధిత పోలీస్ స్టేషన్‌లో అప్లికేషన్‌ను అందజేయాలని తెలిపారు. భద్రతకు ప్రాధాన్యతమండపాలను ప్రజా రవాణాకు, అత్యవసర వాహనాల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఏర్పాటు చేసుకోవాలని సీఐ సూచించారు. సంబంధిత శాఖల అనుమతులు, విద్యుత్ శాఖ అనుమతి పత్రాలతోనే విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలని తెలిపారు. ప్రతి మండపం వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు 24 గంటలూ నలుగురు వాలంటీర్లు అందుబాటులో ఉండేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని అన్నారు.మండపం వద్ద నిర్వాహక కమిటీ సభ్యుల వివరాలు, బాధ్యత వహించే వ్యక్తుల పేర్లు, ఫోన్ నంబర్లను ప్రదర్శించాలని సూచించారు. షెడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ షార్ట్‌సర్క్యూట్‌కు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అగ్ని ప్రమాదాల నివారణకు ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, నీటి డ్రమ్ములు, ఇసుకను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు.డీజేలకు అనుమతి లేదుగణేష్ మండపాల్లో, శోభాయాత్రలో ఎట్టి పరిస్థితుల్లోనూ డీజేలు ఏర్పాటు చేయరాదని సీఐ స్పష్టం చేశారు. విద్యాసంస్థలు, ఆసుపత్రులు, ప్రార్థనా మందిరాలు, వృద్ధులు, చిన్నారులకు ఇబ్బంది కలగకుండా పోలీసుల అనుమతితో పరిమిత స్థాయిలో చిన్న స్పీకర్లను మాత్రమే వినియోగించాలని సూచించారు.మండపాల వద్ద భక్తి గీతాలనే వినిపించాలని, రాత్రి 10గంటల వరకు మాత్రమే స్పీకర్లను వినియోగించాలని తెలిపారు.మండపాల వద్ద మద్యం సేవించడం, జూదం ఆడటం, అసభ్యకర నృత్యాలు నిర్వహించడం, ఇతరుల మనోభావాలను కించపరిచే ప్రసంగాలు, పాటలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం పూర్తిగా నిషేధమని హెచ్చరించారు.
శోభాయాత్రలో క్రమశిక్షణ పాటించాలి
గణేష్ నిమజ్జన శోభాయాత్రను మధ్యాహ్నం నుంచే ప్రారంభించి, నిర్దేశిత సమయానికి నిమజ్జనం పూర్తయ్యేలా పోలీసులకు సహకరించాలని సీఐ కోరారు. ప్రతిష్ఠాపన, నిమజ్జనం రోజుల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలన్నారు. శోభాయాత్రలో ఇతరులపై రంగులు చల్లడం, కించపరిచే నినాదాలు చేయడం, టపాసులు పేల్చడం పూర్తిగా నిషేధమని తెలిపారు. శోభాయాత్రకు వినియోగించే వాహనాలు మంచి కండిషన్‌లో ఉండాలని, డ్రైవర్‌కు డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు ఉండాలని సూచించారు. మద్యం సేవించి శోభాయాత్రలో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే వెంటనే సమాచారంమండపాల వద్ద అనుమానాస్పద బ్యాగులు, వస్తువులు లేదా వ్యక్తులు కనిపించిన వెంటనే పోలీసులకు లేదా డయల్ 100కు సమాచారం అందించాలని సీఐ సూచించారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మవద్దని, సందేహాలు ఉంటే పోలీసులను సంప్రదించాలని కోరారు.మహిళలు, చిన్నారుల భద్రతకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, మండపాలు, శోభాయాత్రలో వారికి ఇబ్బందులు కలిగించేలా ఎవరైనా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండపాల వద్ద పాయింట్ బుక్స్ ఏర్పాటు చేసుకోవాలని, ఉదయం, సాయంత్రం, రాత్రి వేళల్లో పోలీసులు చేసే తనిఖీలకు నిర్వాహకులు సహకరించాలని సూచించారు.గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని మేడిపల్లి సీఐ డి.జలంధర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## శ్రావణమాస ముగింపు.. పత్రి నిమజ్జనం




*** గణేష్ మండప నిర్వాహకులతో సమీక్షా సమావేశం నిర్వహించిన సీపీ**
*** పోలీస్ నిబంధనలు, భద్రతా ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని ఆదేశం**

**సిద్దిపేట,**
**సెప్టెంబర్ 12 (వుదయం బ్యూరో)**

రాబోయే వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణం లో, ఆధ్యాత్మిక శోభతో జరుపుకోవాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్, పిలుపునిచ్చారు. ఉత్సవాల నిర్వహణ, శోభాయాత్ర మరియు నిమజ్జన కార్యక్రమాలపై శనివారం ఆమె గణేష్ మండప నిర్వాహకులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించి పలు కీలక సూచనలు, మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, మండప నిర్వాహకులు నిమజ్జనం తేదీ, శోభాయాత్ర రూట్ వివరాలను తెలంగాణ పోలీస్ పోర్టల్ ద్వారా ముందస్తుగా నమోదు చేసుకోవాలని, దీనివల్ల పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ నిర్వహణ సజావుగా సాగుతుందని తెలిపారు. ప్రతి మండపం వద్ద ఫైర్ ఎక్స్‌స్టింగ్విషర్లు అందుబాటులో ఉంచుకోవడంతో పాటు విద్యుత్ వైర్ల విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర శాఖల కాంటాక్ట్ నంబర్ల బోర్డులను స్పష్టంగా ఏర్పాటు చేయాలని సూచించారు. మండపాల వద్ద మరియు శోభాయాత్రలో డీజేలకు అనుమతి లేదని, సోషల్ మీడియా పుకార్లను నమ్మవద్దని సీపీ స్పష్టం చేశారు. ఇతరుల మత విశ్వాసాలను దెబ్బతీసే పాటలు, నినాదాలు వాడకూడదని హెచ్చరిస్తూ, సామాజిక భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ దిశగా ప్రజలు, నిర్వాహకులు పోలీసులతో సమన్వయం పాటించాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీలు కుశాల్కర్, సుభాష్ చంద్రబోస్, మున్సిపల్ కమిషనర్, ఏసీపీలు, సీఐలు, ఎస్ఐలు మరియు గణేష్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

## గోటిగార్పల్లిలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తం



**- ఉపయోగం లో లేని -డంపింగ్ యాడ్ గ్రామ చివరిలోనే చెత్త చెదారం వేస్తున్నవైనం**

**కోహీర్**
**సెప్టెంబర్ 12 (వుదయం ప్రతినిధి)**

సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని గోటిగార్పల్లి గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ తీవ్రంగా దెబ్బతిన్నది. గ్రామంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు కుప్పలు తెప్పలుగా పేరుకుపోయాయి.కొన్ని రోజులుగా చెత్తను తొలగించకపోవడంతో అటుగా వెళ్లే బాటసారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఎండల వేడికి, తేమకు వ్యర్థాలు కుళ్ళిపోయి కాలనీ అంతటా విపరీతమైన దుర్గంధం వెదజల్లుతోంది.రోడ్డు పక్కనే పారబోసిన చెత్త కారణంగా దోమలు, ఈగలు, సూక్ష్మజీవులు విపరీతంగా పెరిగిపోతున్నాయి.పరిసరాలు మురికిమయంగా మారడంతో స్థానిక ప్రజలు సీజనల్ వ్యాధులు, ఇన్ఫెక్షన్ల బారిన పడే ప్రమాదం నెలకొంది.చిన్నారులు, వృద్ధులు ఈ దుర్గంధం వల్ల ఊపిరి తీసుకోవడానికి కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
మూగజీవాలు ఆ ప్లాస్టిక్ వ్యర్థాలను తింటూ అనారోగ్యం పాలవుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గ్రామంలో క్రమం తప్పకుండా చెత్తను సేకరించి ఎప్పటికప్పుడు తొలగించడంలో పంచాయతీ సిబ్బంది విఫలమయ్యారు. స్థానికులు చెపుతున్నారు గ్రామ పంచాయతీ అధికారులు మాత్రం ఈ సమస్యను తమకేమీ పట్టనట్లు వదిలేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.'స్వచ్ఛ భారత్', 'పరిసరాల పరిశుభ్రత' అంటూ అధికారులు చేసే ప్రచారాలు కేవలం మాటలకే పరిమితమయ్యాయి.క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే గోటిగార్పల్లిలో పరిశుభ్రత పూర్తిగా అటకెక్కిందని స్పష్టమవుతోంది.పారిశుద్ధ్య లోపంపై పలుమార్లు పంచాయతీ కార్యాలయంలో విన్నవించినా ఎవరూ స్పందించడం లేదని స్థానికులు మండిపడుతున్నారు.ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు నిద్రమత్తు వీడి తక్షణమే స్పందించాలి.పేరుకుపోయిన చెత్తకుప్పలను వెంటనే జెసిబి, ట్రాక్టర్ల సాయంతో తొలగించి రోడ్డును శుభ్రపరచాలి.దోమల వ్యాప్తిని అరికట్టడానికి గ్రామంలో బ్లీచింగ్ పౌడర్ చల్లి, ఫాగింగ్ చర్యలు చేపట్టాలి.చెత్త వేయడానికి నిర్దిష్ట ప్రాంతాలను కేటాయించి,డంపింగ్ యాడ్ వియోగం లోకి తీసుకొని రావాలి అలాగే డస్ట్‌బిన్‌లు అందుబాటులో ఉంచాలి.నిబంధనలు అతిక్రమించి రోడ్ల ఇరువైపులా చెత్త పారబోసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. గ్రామంలో పారిశుద్ధ్య పనులను రోజువారీగా పర్యవేక్షించేలా ప్రత్యేక సిబ్బందికి బాధ్యతలు అప్పగించాలి. నిర్లక్ష్యం వహించిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.అధికారులు ఇకనైనా స్పందించి గ్రామాన్ని పరిశుభ్రంగా మార్చకపోతే పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

## శ్రీశనేశ్వర స్వామి భాద్రపద అభిషేకం



**బిజినేపల్లి,**
**సెప్టెంబర్ 12 (వుదయం ప్రతినిధి):**

శ్రీ పరాభవ నామ సంవత్సరం భాద్రపద మాసం శుక్ల పక్ష పాడ్యమి, విదియ శనివారం ఉత్తరహస్త నక్షత్రం సందర్భంగా బిజినేపల్లి మండలం నందివడ్డేమాన్ గ్రామంలోని శ్రీశనేశ్వర స్వామికి భక్తిశ్రద్ధలతో తిల తైల అభిషేక పూజలు నిర్వహించారు.భక్తులు శని గ్రహ దోష నివారణ కోసం స్వామివారికి వేద మంత్రోచ్చారణల మధ్య తిల తైల అభిషేకాలు చేశారు. శ్రీ సార్ధా సప్త జేష్ఠమాత సమేత శనేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి.ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి మాట్లాడుతూ.. ఈ మాసంలో స్వామివారిని కొలిస్తే సంతృప్తి చెంది విశేష ఫలితాన్ని భక్తులకు ప్రసాదిస్తారన్నారు. ప్రతి ఒక్కరు జన్మరీత్యా, గోచార రీత్యా శని గ్రహ దోష నివారణకు శక్తి మేరకు స్వామివారిని పూజించాలని సూచించారు.అదేవిధంగా ఆలయంలో గోన బుద్ధారెడ్డి కాలంనాటి బ్రహ్మ సూత్రం గల పరమశివునికి భక్తులచే రుద్రాభిషేక పూజలు, అర్చనలు, దీపారాధన, నందీశ్వర స్వామివారికి ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు వేద ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాల పంపిణీ చేశారు.
ఈకార్యక్రమంలో ఆలయ చైర్మన్ వెల్దండ గోపాల్ రావు, గ్రామ సర్పంచ్ టి. సుగుణమ్మ, కమిటీ సభ్యులు కెంచె రాజేష్, ప్రభాకరాచారి, పుల్లయ్య, అడ్వకేట్ వీర శేఖర్ చారి, శ్రీకాంత్ రెడ్డి, ఆలయ అర్చకులు శాంతి కుమార్, ఉమామహేశ్వర్, సిబ్బంది గోపాల్ రెడ్డి, భక్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు

## రామాయంపేట లో బీజేపీ నేతల ముందస్తు అరెస్టులు



**- ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల కోసం 'చలో అసెంబ్లీ' : బిజెపి**

**రామాయంపేట,సెప్టెంబర్ 12 (వుదయం ప్రతినిధి రాజాగౌడ్):**

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ చేపట్టిన 'చలో అసెంబ్లీ-ముట్టడి' కార్యక్రమం నేపథ్యంలో రామాయంపేటలో పోలీసులు ముందస్తు అరెస్టులు చేపట్టారు. శనివారం పట్టణానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.అరెస్టైన వారిలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు శీలం అవినాష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అక్కల అనిల్, నాయకులు సంతోష్, బీజేవైఎం నాయకులు నాగరాజు, దువ్వెనపల్లి సందీప్‌తో పాటు పలువురు కార్యకర్తలు ఉన్నారు. చలో అసెంబ్లీ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉన్న నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు.

## రామాయంపేటలో పోలింగ్ కేంద్రాల తనిఖీ



**- నో మ్యాపింగ్, లాజికల్ డిస్క్రెపెన్సీ కేసుల పరిష్కారానికి ఆదేశాలు**

**రామాయంపేట, సెప్టెంబర్ 12 (వుదయం ప్రతినిధి రాజాగౌడ్):**

ఓటర్ల జాబితా పరిశీలనలో భాగంగా మెదక్ ఆర్డీవో రామదేవి మరియు రామాయంపేట తహసీల్దార్ రజినీ కుమారి శనివారం రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని 80, 81, 84, 85, 87, 89 పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఓటర్ల జాబితా సవరణ, ఫారం 6, 7, 8 దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, నమోదును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నో మ్యాపింగ్, లాజికల్ డిస్క్రెపెన్సీ కేసులకు సంబంధించిన వివరాలను పరిశీలించి, పెండింగ్ కేసులను నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.కోనాపూర్‌లో పోలింగ్ కేంద్రాల పరిశీలనఅనంతరం రామాయంపేట మండలం కోనాపూర్ గ్రామంలోని 92, 93 పోలింగ్ కేంద్రాలను ఆర్డీవో రామదేవి తనిఖీ చేశారు. నో మ్యాపింగ్, లాజికల్ డిస్క్రెపెన్సీ కేసుల ఫైళ్లను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న కేసులపై రోజువారీ విచారణ చేపట్టి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. బీఎల్ఓ యాప్‌లో ఫారం6, 7, 8 దరఖాస్తుల నమోదును పరిశీలించి, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం వివరాలను సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. ఓటర్ల నుంచి వచ్చిన దరఖాస్తులు, అభ్యంతరాలను నిబంధనల మేరకు పరిశీలించి పరిష్కరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

## విద్యుత్ కోసం రైతుల ధర్నా



**వుదయం న్యూస్ కొండపాక**
**ప్రతినిధి సెప్టెంబర్ 12**

సాగుకు 12 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం రోజున బందారం ,అంకిరెడ్డిపల్లి, దర్గా, రాంపల్లి,దుద్దెడ గ్రామాలకు చెందిన రైతులు దుద్దెడ సబ్ స్టేషన్ ముందు రాజీవ్ రహదారి పైన ధర్నా నిర్వహించారు. అనంతరం విద్యుత్ శాఖ ఏఈ సత్యం కువినతిపత్రంఅందజేశారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ పై అధికారులతో మాట్లాడి రేపటినుండి పాత పద్ధతి ప్రకారం విద్యుత్ సరఫరా చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వ్యవసాయానికి నిర్ణీత సమయం మేరకు విద్యుత్ సరఫరా చేస్తున్నప్పటికీ తరచూ, విద్యుత్తు సరఫరాలో తరుచు అంతరాయాలు కలుగుతున్నాయని దీనితో మోటార్లు కాలిపోయే ప్రమాదం ఉందని, మోటార్లు కాలిపోతే ఇప్పటికే నానా అవస్థలు పడుతున్న రైతులకు ఇదొక తలకు మించిన భారం అవుతుందని బాధని వ్యక్తం చేసారు.కొంతమంది రైతుల పంటలు ఇపుడు పొట్ట దశలో ఉన్నాయని ఇలాంటి పంటలకు ఈ వచ్చి పోయే కరెంట్ వళ్ళ తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేసారు. పగలు, రాత్రి సమయాల్లో విద్యుత్ సరఫరాఅవుతుండడం తో రాత్రిళ్ళు రైతులు పొలాలవద్దకు వెళ్ళడానికి చాలా ఇబ్బంది గా ఉందని, రైతులకు ఈ కష్టాల నుండి గట్టెక్కించేందుకు కచ్చితంగా 12 గంటల పాటు నిరంతరంగా, కోతలు లేకుండా వ్యవసాయ విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకపోతే రాజీవ్ రహదారిపై రైతులతో కలిసి ఎంతటి పోరుకైనా రైతాంగం సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు బంధు సమితి మాజీ కోఆర్డినేటర్ ర్యాగాల్ల దుర్గయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు నూనె కుమార్, బీజేపీ మండల అధ్యక్షులు నీల సత్యం, దుద్దెడ సర్పంచ్ మిద్దె శివకుమార్, అంకిరెడ్డిపల్లి సర్పంచ్ గాలి బాలయ్య, నాయకులు తేలు అశోకు, పిడిశెట్టి శ్రీనివాస్, రాసుల రంజిత్ ,గోనె శ్రీనివాస్, బాలాజీ, నీల వెంకటేష్, ఎలుక రాజిరెడ్డి, గజ్వేల్ కర్ణాకర్ రెడ్డి, గంగుల వెంకటేష్, బట్ట వెంకటేష్, మిద్దె చెద్రమౌళి ,మిట్టపల్లి రాజు, నీల హరీష్, మిద్దెచెంద్రమౌళి, గగిల్లాపురం సాయి బాబు, దుద్దెడ నరేష్ గౌడ్, పల్లె యాదగిరి తో పాటు ఐదు గ్రామాల రైతులు ఈ ధర్నా లో పాల్గొన్నారు

## రామాయంపేటలో పోలింగ్ కేంద్రాల తనిఖీ



**బిజినేపల్లి,**
**సెప్టెంబర్ 12 (వుదయం ప్రతినిధి):**

సీపీఎం అఖిల భారత మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి గారి రెండవ వర్ధంతి సందర్భంగా బిజినేపల్లి మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు గుంపల్లి అశోక్ మాట్లాడుతూ.. సీతారాం ఏచూరి గారు భారత కమ్యూనిస్టు ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం, లౌకిక వాదం, సామాజిక న్యాయం, పేదల, కార్మికుల, రైతుల హక్కుల కోసం ఆయన జీవితాంతం పోరాడారని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాన్ని మరింత ఉధృతం చేయడమే ఏచూరి గారి ఆశయాలకు నిజమైన నివాళి అన్నారు. ఆయన మార్గంలో సీపీఎం కార్యకర్తలు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో మండల సీపీఎం నాయకులు రాములు, నర్సింహ, ఎల్లయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు

## శ్రీ భద్రకాళి సమేత శ్రీ రాచ్చన్న స్వామివారి కళ్యాణ మహోత్సవం



**కోహీర్**
**సెప్టెంబర్ 12 (వుదయం ప్రతినిధి )**

సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం బడంపేట్ గ్రామంలో ఆధ్యాత్మిక వేడుకలు జరిగాయి.గ్రామంలో వెలసిన శ్రీ భద్రకాళి సమేత శ్రీ రాచ్చన్న స్వామివారి కళ్యాణ మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలతో పాటు గత నెల సాగుతున్న శ్రావణ మాస లక్ష బిల్వార్చన మహోత్సవాలు ముగిశాయి.ఉదయాన్నే ఆలయంలో స్వామివారికి పండితులు విశేష రుద్రాభిషేకం నిర్వహించారు.భద్రకాళి అమ్మవారికి వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక కుంకుమార్చన పూజలు జరిపారు.ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన ఉత్సవ విగ్రహాలకు అర్చకులు శాస్త్రోక్తంగా అభిషేకం చేశారు.
అత్యంత పవిత్రమైన శ్రావణ మాస లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని వైభవంగా పూర్తి చేశారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయంలో త్రిశూల స్నానం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో చేపట్టారు.స్వామి, అమ్మవార్ల దివ్య కళ్యాణ మహోత్సవాన్ని భక్తుల సమక్షంలో కన్నులపండువగా జరిపించారు.ఈ కళ్యాణ మహోత్సవంతో శ్రావణ మాస ప్రత్యేక ఉత్సవాలకు అధికారికంగా ముగింపు పలికారు.ఈ పవిత్ర కార్యక్రమంలో ఈ ఓ. శివ రుద్రప్ప మరియు బడంపేట్ గ్రామానికి చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పరిసర గ్రామాల నుండి కూడా భక్తులు విశేషంగా తరలివచ్చి ఉత్సవాల్లో భాగస్వాములయ్యారు.ఆలయ ప్రాంగణమంతా భక్తుల శివనామస్మరణలు,జయజయధ్వనులతో.మారుమోగిపోయింది.భక్తులందరూ స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తమ మొక్కుబడులు తీర్చుకున్నారు.పూజా కార్యక్రమాల అనంతరం అర్చకులు భక్తులకు పవిత్ర తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులందరూ తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి దివ్యాశీస్సులు పొందారు.
ఈ ఆధ్యాత్మిక వేడుక గ్రామంలో ఎంతో భక్తిపరవశాన్ని, పండుగ వాతావరణాన్ని నింపింది.గ్రామస్తులందరూ కలిసికట్టుగా ఉత్సవాల నిర్వహణలో భాగస్వాములయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు మరియు అర్చకులు వేడుకలను అత్యంత శ్రద్ధతో నిర్వహించారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు, నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

## వంశీకృష్ణ జన్మదిన వేడుకలు



**అచ్చంపేట,**
**సెప్టెంబర్ 12 (వుదయం ప్రతినిధి):**

శ్రీశైలం ఉత్తర ద్వారమైన అచ్చంపేట మండలం శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ జన్మదినం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఎమ్మెల్యే వంశీకృష్ణ సతీమణి, CBM ట్రస్ట్ చైర్ పర్సన్ డాక్టర్ చిక్కుడు అనురాధ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం, కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ అనురాధ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆయురారోగ్యాలతో ఉండి, రాజకీయంలో అత్యున్నత పదవులు అధిరోహించి ప్రజలకు మరింత సేవ చేయాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు, పవన్ కుమార్, కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు

## సంధ్య బాబుకు ఉత్తమ పురస్కారం



**ఎర్రవల్లి, సెప్టెంబర్ 12**
**(వుదయం కరస్పాండెంట్)**

ఎర్రవల్లి మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి ఇంటర్నేషనల్ సీబీఎస్ఈ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు సంధ్య బాబుకు అరుదైన గౌరవం దక్కింది. తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (ట్రస్మా) ఆధ్వర్యంలో అందించే జిల్లా ప్రైవేట్ స్కూల్ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఆయన ఎంపికయ్యారు.విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను వెలికితీయడంతో పాటు క్రమశిక్షణ, సమయపాలన, మంచి నడవడిక, ఆరోగ్యకరమైన జీవన విధానంపై అవగాహన కల్పించడంలో ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం లభించింది. ఈ అవార్డును గద్వాల నియోజకవర్గ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు.ఈ సందర్భంగా సంధ్య బాబు మాట్లాడుతూ.. తనను ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తూ వెన్నుదన్నుగా నిలిచిన పాఠశాల చైర్మన్ వీర గోవర్ధన్ రెడ్డి, డైరెక్టర్ వీర శ్రీనివాస్ రెడ్డి, కరస్పాండెంట్ మధులిక రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా పురస్కారం అందుకోవడం ఎంతో గర్వంగా, అదృష్టంగా ఉందన్నారు.ఈ అవార్డు తనలో మరింత బాధ్యతతో పాటు కష్టపడి పనిచేసే శక్తిని నింపిందని, భవిష్యత్తులో విద్యార్థుల క్రీడా ప్రతిభ, వ్యక్తిత్వ వికాసానికి మరింత అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. తనను పురస్కారానికి ఎంపిక చేసిన ట్రస్మా ప్రతినిధులు, పాఠశాల యాజమాన్యం, తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులకు సంధ్య బాబు కృతజ్ఞతలు తెలిపారు.

## వినాయక నవరాత్రులు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలి...

**గణేష్ ఉత్సవాల నిర్వహణపై మండప నిర్వహకులతో సమావేశం నిర్వహించిన పోలీసులు...**

**కోరుట్ల**
**సెప్టెంబర్ 12 (వుదయం ప్రతినిధి)**

రాబోయే గణేష్ ఉత్సవాల నేపథ్యంలో కోరుట్ల పట్టణంలోని గణేష్ మండపాల నిర్వాహకులతో మెట్‌పల్లి డీఎస్పీ రాములు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా డీఎస్పీ రాములు మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలు ఊరేగింపులను ప్రశాంత పోలీస్ శాఖ సూచించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు మండపాల వద్ద విద్యుత్ భద్రత ట్రాఫిక్ నియంత్రణ శబ్ద కాలుష్య నియంత్రణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడటం వంటి అంశాలపై నిర్వాహకులకు సూచనలు చేశారు అలాగే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీస్ శాఖకు నిర్వాహకులు పూర్తిగా సహకరించాలని మత సామరస్యం శాంతిభద్రతలను లో కోరుట్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ కే లక్ష్మీ నారాయణ కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ వైస్ చైర్మన్ షాహిద్ విద్యుత్ శాఖ డీఈజి మధుసూదన్ మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ అశోక్ సబ్ ఇన్స్పెక్టర్ శ్యామ్ రాజ్ పోలీస్ సిబ్బంది గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

## శ్రీనివాస పాఠశాలలకు ఉత్తమ పాఠశాల అవార్డు




**కరస్పాండెంట్ శ్రీనివాసరావుకు ఉత్తమ అవార్డు**

**రాజోలి, సెప్టెంబర్ 12**
**(వుదయం కరస్పాండెంట్)**

రాజోలి మండలం పచ్చర్ల గ్రామంలో గత కొన్నేళ్లుగా విద్యా సేవలు అందిస్తూ ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న శ్రీనివాస పాఠశాలలు ట్రస్టు ఆధ్వర్యంలో జోగులాంబ గద్వాల జిల్లాలో ఉత్తమ పాఠశాలగా అవార్డు అందుకోవడం అభినందనీయమని పచ్చర్ల మాజీ ఎంపీటీసీ, రాజోలి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పచ్చర్ల శ్రీనివాసులు అన్నారు.అదేవిధంగా శ్రీనివాస పాఠశాలల కరస్పాండెంట్ శ్రీనివాసరావుకు ఉత్తమ అవార్డు చేశారు. పచ్చర్ల గ్రామానికి, రాజోలి మండలానికి ఈ అవార్డులు గర్వకారణమని పేర్కొన్నారు. విద్యార్థుల్లో విద్యతో పాటు క్రమశిక్షణ, ప్రతిభను పెంపొందిస్తూ మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు పాఠశాల యాజమాన్యం చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. విద్యార్థుల భవిష్యత్తుకు అవసరమైన నాణ్యమైన విద్యను అందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా శ్రీనివాస పాఠశాలల యాజమాన్యానికి, కరస్పాండెంట్ శ్రీనివాసరావుకు, ఉపాధ్యాయ బృందానికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# డిండి ప్రాజెక్టును అడ్డుకొని తీరుతాం

**నాగర్ కర్నూల్**
**సెప్టెంబర్ 12 (వుదయం బ్యూరో)**



ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా రైతులు, ప్రజల సాగునీటి హక్కులు ప్రయోజనాలకు భంగం కలిగించే డిండి ఎత్తిపోతల పథకం కోసం తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో పోరాటాలకు సన్నద్ధం కావాలని ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ చైర్మన్ రాజేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం జేఏసీ నాయకులు ముసలి శ్యామ్ ప్రసాద్ రెడ్డి అధ్యక్షతన నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని గాంధీ పార్క్ ఆవరణలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నుంచి కొత్తగా డిండి ఎత్తిపోతల పథకానికి నీటి తరలింపును నిరసిస్తూ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ ఆధ్వర్యంలో ఒకరోజు
సత్యాగ్రహ దీక్షను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా రైతులను ప్రజలను చైతన్య వంతులను చేసి ఉమ్మడి జిల్లాకు జరిగిన జరుగుతున్న అన్యాయాలపై చైతన్య వంతులను చేసి ఉమ్మడి జిల్లా హక్కులను సాధించే విధంగా పోరాటాలు సాగిస్తామని రాజేందర్ రెడ్డి అన్నారు. పాలమూరు రైతుల హక్కులకు భంగం కలిగించే చర్యలను మానుకోవాలని లేనియెడల మరో ఉద్యమానికి సిద్ధమవుతామన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును నీరు గారిచేందుకే డిండి ఎత్తిపోతల పథకాన్ని తెరపైకి తెచ్చి పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలకు సంబంధం లేని కొత్త పథకం డిండిని జోడించడం తగదన్నారు. ఇప్పటికే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 35 వేల కోట్లు ఖర్చు చేసినట్టు ప్రభుత్వాలు చెబుతున్న ఇప్పటివరకు 30 ఎకరాలకు కూడా సాగునీరు ఇవ్వలేదని ఆయన ఆరోపించారు. ఎదుల రిజర్వాయర్ నుంచి ఢిల్లీకి నీటిని తరలించడానికి సొరంగం నిర్మించడానికి ప్రభుత్వం సన్నద్ధమైందని దీనిని విరమించుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. పాలమూరు ప్రజల హక్కులకు భంగం కలిగించే డిండి లాంటి హక్కులను కాపాడు కృష్ణా నష్టపోయిందని ఇది అంతా ఉమ్మడి రాష్ట్ర పాలకులు తెలంగాణ రాష్ట్రం సాధించాక అధికారాన్ని అనుభవించిన నాయకుల వల్లే నష్టం జరుగుతుందని పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సత్యాగ్రహ దీక్షకు సంఘీభావం తెలుపుతూ వివిధ రాజకీయ పార్టీల నాయకులు వివిధ స్వచ్ఛంద సంస్థల బాధ్యులు సాగునీటి విషయంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు జరుగుతున్న అన్యాయాల పై జేఏసీ ఏ పిలుపు ఇచ్చిన కలిసి వచ్చి పోరాటాలకు సిద్ధంగా ఉంటామని హామీ ఇచ్చారు. అదేవిధంగా ఉమ్మడి జిల్లాకు జరుగుతున్న అన్యాయాన్ని ఎదుర్కోవడానికి అన్ని రాజకీయ పార్టీలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఉదయం గ్రహ దీక్ష సాయంత్రం వరకు వక్తలు మేధావులు సంఘీభావం తెలపడానికి వచ్చిన వివిధ జేఏసీల నాయకులు రాజకీయ పార్టీల నాయకులు తమ అమూల్యమైన సందేశాలతో అనేక సూచనలు సలహాలు ఇస్తూ భవిష్యత్తులో చేపట్టే ఉద్యమానికి స్ఫూర్తిగా నిలిచారని వారికి ఉమ్మడి మహబూబ్నగర్ పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ కృతజ్ఞతలు తెలుపుతుందని భవిష్యత్తులో చేపట్టే ఉద్యమాలకు కలిసి వచ్చి హక్కులను సాధించుకునే వరకు కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ సత్యాగ్రహ దీక్షలో బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు నాగం శశిధర్ రెడ్డి సంఘీభావం తెలిపారు. సోషలిస్టు పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నరసింహ గద్వాల జేఏసీ నాయకులు ప్రకాష్ గౌడ్ కే ఎల్ ఐ జేఏసీ నాయకులు రామచంద్రారెడ్డి, జనసేన రాష్ట్ర నాయకులు వంగా లక్ష్మణ్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి నాగయ్య నాయక్ ప్రకాష్‌లక్ష్మారెడ్డి సాంబశివుడు హైందవ రెడ్డి లక్ష్మీనారాయణ సదానందం గౌడ్ లక్ష్మి గుడిపల్లి నిరంజన్ సత్యం సూర్య ప్రకాష్ మధు బేకెం జనార్దన్, అర్థం రవి రవీంద్రనాథ్ లింగస్వామి లక్ష్మణ్ గౌడ్, రిటైర్డ్ డిప్యూటీ తహసిల్దార్ షేక్ మొహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# థ్రెడ్ ఆర్ట్‌లో ఓ విద్యార్థిని ఆశలు

**సంగారెడ్డి:వుదయం**



చదువుకోవాలనే తపన ఉంది.. లక్ష్యం ఉంది.. కానీ కుటుంబ ఆర్థిక పరిస్థితులు అడ్డుగా నిలిచాయి. తల్లి దండ్రులకు ఉన్న రెండున్నర ఎకరాల భూమి 12 ఏళ్లుగా వివాదంలో ఉండటంతో ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. దీంతో తన చదువును కొనసాగించాలా.. మధ్యలోనే ఆపేయాలా అనే పరిస్థితిలో ఉన్న రాయికోడ్ మండలం కప్పాడ్ గ్రామానికి చెందిన విద్యార్థిని భవాని.. సమస్యకు పరిష్కారం కోసం వినూత్న మార్గాన్ని ఎంచుకుంది.చిన్నప్పటి నుంచే ఆర్ట్‌పై ఆసక్తి ఉన్న భవాని.. జగ్గారెడ్డిని కలిస్తే తన కుటుంబ భూమి సమస్య పరిష్కారానికి మార్గం దొరుకుతుందనే నమ్మకంతో ఆయనకు ప్రత్యేకమైన బహుమతి ఇవ్వాలని నిర్ణయించుకుంది. ఇంటర్నెట్ ద్వారా ఫీజు చెల్లించి థ్రెడ్ ఆర్ట్ తయారీని నేర్చుకుని.. ఏకంగా పది రోజుల పాటు శ్రమించి జగ్గారెడ్డి చిత్రపటాన్ని రూపొందించింది.చదువు ఆగిపోవద్దనే పట్టుదలశివాని మోడల్ స్కూల్‌లో చదువుకుంది. ప్రస్తుతం అసోసియేటెడ్ చార్టర్డ్ సర్టిఫైడ్ అకౌంటెంట్ (ACCA) కోర్సు చదువుతోంది. ఇప్పటికే మొదటి లెవల్ పూర్తి చేసింది. అయితే కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా గత ఆరు నెలలుగా చదువుకు దూరంగా స్వగ్రామంలోనే ఉంటోంది. ముగ్గురు ఆడపిల్లలున్న కుటుంబంలో ఒకవైపు అక్క భవాని బీటెక్ పూర్తి చేసి వివాహానికి సిద్ధమవుతుండగా.. మరోవైపు తన చదువు కొనసాగించేందుకు కుటుంబానికి ఉన్న రెండున్నర ఎకరాల భూమిపైనే ఆశలు పెట్టుకున్నారు.అయితే ఆ భూమి 12 ఏళ్లుగా వివాదంలో ఉండటంతో విక్రయించలేని పరిస్థితి నెలకొంది. సమస్య రెవెన్యూ అధికారుల వద్ద పెండింగ్‌లో ఉండటంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది. ఈ నేపథ్యంలో చదువు మానేయాలని తండ్రి సూచించినప్పటికీ.. భ వాని మాత్రం చదువును రోజులు.. ఒక చిత్రపటంతన సమస్యకు పరిష్కారం చూపగలరనే నమ్మకంతో జగ్గారెడ్డిని కలవాలని భవాని నిర్ణయించుకుంది. ఆయనను కలిసినప్పుడు తనవంతుగా ప్రత్యేకమైన బహుమతి ఇవ్వాలని భావించింది. అందుకోసం థ్రెడ్ ఆర్ట్ నేర్చుకుని.. పది రోజుల పాటు శ్రమించి జగ్గారెడ్డి చిత్రపటాన్ని తయారు చేసింది.చిత్రపటం సిద్ధమైన తర్వాత తన గ్రామానికి చెందిన పరిచయస్తుల ద్వారా సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు చేర్యాల ఆంజనేయులు, చిమ్నాపూర్ ప్రకాష్, పాస్టర్ మోజెస్‌ను సంప్రదించింది. వారి సహకారంతో శనివారం తల్లిదండ్రులతో కలిసి జగ్గారెడ్డిని కలిసింది. తాను ఎంతో శ్రమించి తయారు చేసిన చిత్రపటాన్ని ఆయనకు అందజేసింది. కలెక్టర్‌తో మాట్లాడతానన్న జగ్గారెడ్డిబవాని అందించిన చిత్రపటాన్ని స్వీకరించిన జగ్గారెడ్డి.. ఆమెతో ఆప్యాయంగా మాట్లాడారు. ఆర్ట్ ఎలా నేర్చుకుంది, ప్రస్తుతం ఏం చదువుతోంది తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తన కుటుంబ పరిస్థితిని శివాని వివరించింది. తల్లిదండ్రులకు ఉన్న రెండున్నర ఎకరాల భూమి వివాదంలో ఉందని, రెవెన్యూ అధికారుల వద్ద సమస్య పెండింగ్‌లో ఉందని తెలిపింది. భూమి సమస్య పరిష్కారమైతే వచ్చిన డబ్బుతో తన చదువును తిరిగి కొనసాగించి, ACCA పూర్తి చేయాలనుకుంటున్నట్లు వివరించింది.బవాని పరిస్థితిని తెలుసుకున్న జగ్గారెడ్డి.. భూమి సమస్యపై సంగారెడ్డి కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. చదువును మధ్యలో ఆపకుండా లక్ష్యాన్ని చేరుకోవాలని ఆమెను ప్రోత్సహించారు.బహుమతిగా ఇచ్చిన థ్రెడ్ ఆర్ట్ వెనుక.. తన భవిష్యత్తును నిలబెట్టుకోవాలనే ఓ విద్యార్థిని ఆశ ఉంది. సమస్య పరిష్కారమైతే చదువును కొనసాగించి తన లక్ష్యాన్ని చేరుకోవాలనే శివాని పట్టుదల.. ఈ కలయికను ప్రత్యేకంగా నిలిపింది.

# తాండూరు పరిశ్రమలకు ఎమ్మెల్యే అండ....

***తాండూరు**
**సెప్టెంబర్ 12వుదయం ప్రతినిధి**



తాండూరు ప్రాంత పారిశ్రామిక అభివృద్ధి, స్థానిక ఉపాధి అవకాశాల పరిరక్షణ కోసం తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి శుక్రవారం శాసనసభలో కీలక అంశాలను లేవనెత్తారు. తాండూరులోని నపరాతి పరిశ్రమను కాపాడడంతో పాటు, పారిశ్రామిక రంగానికి అవసరమైన మౌలిక వసతులను కల్పించాలని ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.
తాండూరులో ఆటోమొబైల్ రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు 10 ఎకరాల స్థలాన్ని, ట్రక్కుల పార్కింగ్ కోసం మరో 10 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ సదుపాయాలు అందుబాటులోకి వస్తే తాండూరులో పారిశ్రామిక కార్యకలాపాలు విస్తరించడంతో పాటు, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మరింత పెరిగే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.తాండూరులో ఇప్పటికే ఉన్న పరిశ్రమలను పరిరక్షిస్తూ, కొత్త పరిశ్రమలకు ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే అసెంబ్లీలో ప్రస్తావించారు. పరిశ్రమల అభివృద్ధికి అవసరమైన భూమి, పార్కింగ్, ఇతర మౌలిక వసతులను కల్పిస్తే తాండూరు పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు.
తాండూరు ప్రజల సంక్షేమం, ప్రాంత అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని పారిశ్రామిక రంగానికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి కోరారు. అసెంబ్లీ వేదికగా తాండూరు సమస్యలను ప్రస్తావించడం పట్ల స్థానికంగా కాంగ్రెస్ నాయకుడు హర్షం వ్యక్తం చేస్తున్నారు

# 13 ఏళ్ల ఎడబాటుకు తెర.. లోక్ అదాలత్‌తో కలిసిన దంపతులు!



*** ఖైదీలపై కేసులు, జటిలమైన కుటుంబ వివాదాలకు 'రాజీయే రాజమార్గం'**
*** గజ్వేల్ న్యాయస్థానంలో సామరస్యంగా దంపతుల సమస్య పరిష్కారం**
**గజ్వేల్,**
**సెప్టెంబర్ 12 (వుదయం ప్రతినిధి)**

సుదీర్ఘకాలంగా కోర్టుల చుట్టూ తిరిగే కేసులకు, కుటుంబ విభేదాలకు, ఖైదీలపై ఉన్న వివాదాలకు లోక్ అదాలత్ 'రాజీయే రాజమార్గం'గా నిలుస్తోంది. పుష్కరకాలానికి పైగా నలుగుతున్న ఓ జటిలమైన కుటుంబ వివాదానికి గజ్వేల్ లోక్ అదాలత్ వేదికగా శుభం కార్డు పడింది. 13 సంవత్సరాలుగా వేర్వేరుగా ఉంటున్న భార్యాభర్తలు న్యాయమూర్తుల చొరవతో తమ విభేదాలను మరిచి, సామరస్యపూర్వకంగా రాజీపడి మళ్లీ ఒకటయ్యారు.
బాధితుల కథనం ప్రకారం.. అహ్మదీపూర్ గ్రామానికి చెందిన అండె లక్ష్మికి, తోగుట మండలం లింగంపేటకు చెందిన అండె ఆంజనేయులుతో వివాహమైంది. వివాహ సమయంలో రూ.30 వేల నగదు, 2 తులాల బంగారం, 40 తులాల వెండి కట్నంగా సమర్పించారు. కొన్నాళ్లు వీరి సంసారం సజావుగా సాగి, ఒక కుమారుడు, కుమార్తె జన్మించారు. అనంతరం అదనపు కట్నం కోసం భర్తతో పాటు అత్త, మామ, ఇతర కుటుంబ సభ్యులు శారీరకంగా, మానసికంగా వేధించడమే కాకుండా ఇంటి నుంచి బయటకు పంపించేశారు. గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీలు నిర్వహించినా ఫలితం లేకపోవడంతో, 2013 మే 14న లక్ష్మి గజ్వేల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి నుంచి గత 13 ఏళ్లుగా దంపతులిద్దరూ ఎడబాటుతో వేర్వేరుగా జీవిస్తున్నారు. శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ఈ కేసును విచారణకు స్వీకరించగా, ఇరువర్గాలకు న్యాయమూర్తి, పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. పెద్దల సమక్షంలో జరిగిన చర్చలు ఫలించడంతో, తమ పాత పగలు, విభేదాలను పక్కనబెట్టి కలసి జీవించేందుకు దంపతులు అంగీకరించారు. దీంతో పదమూడేళ్ల సుదీర్ఘ ఎడబాటుకు తెరపడింది. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ప్రథమ శ్రేణి న్యాయాధికారి స్వాతి గౌడ్, ఏపీపీ మాధవీలత, గజ్వేల్ సీఐ రవి కుమార్, న్యాయవాది అశోక్ రెడ్డి తదితరులు పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. తీవ్ర మనోవేదనకు గురిచేసే కోర్టు కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవడమే శ్రేయస్కరమని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు.

## సికింద్రాబాద్ బొల్లారం ఆయుధాల అపహరణ కేసులో నాగర్ కర్నూల్ జవాన్ అరెస్ట్




**నాగర్ కర్నూల్,**
**సెప్టెంబర్ 12 (వుదయం ప్రతినిధి):**

సికింద్రాబాద్ బొల్లారం మద్రాస్ ఆర్మీ రెజిమెంట్ నుంచి ఆయుధాలు, మందుగుండు సామగ్రి అపహరణ కేసులో నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట ప్రాంతానికి చెందిన ఆర్మీ జవాన్ రాజు అలియాస్ మల్లేష్ పాత్ర ఉన్నట్లు పోలీసులు, దర్యాప్తు సంస్థలు గుర్తించాయి.ఇళ్లలో దాచి ఉంచిన ఆయుధాలన్నింటినీ స్వాధీనం చేసుకుని నాగర్ కర్నూల్ జిల్లా పోలీసులు మరియు బొల్లారం పోలీసులు మల్లేష్ ను అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్ కు తరలించారని జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి. పాటిల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిందితుడి స్వస్థలం నాగర్ కర్నూల్ జిల్లా పదరా మండలం ఉడిమిల్ల గ్రామం అని ఎస్పీ తెలిపారు. ఆర్మీ జవాన్ రాజు అలియాస్ మల్లేష్ ను పట్టుకోవడంలో కృషి చేసినందుకు నిన్న హైదరాబాద్ లో జరిగిన పత్రిక ప్రకటనలో తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్.. నాగర్ కర్నూల్ జిల్లా పోలీస్ మరియు సీసీఎస్ పోలీస్ స్టేషన్ కు చెందిన ఇన్స్పెక్టర్ శంకర్, ఏఎస్ఐ జానకి రాములు, హెడ్ కానిస్టేబుళ్లు వెంకటయ్య, గోపాల్, వెంకట్ రాములు, కానిస్టేబుల్ లింగం గౌడ్ లను అభినందించారు.

# క్రీడా మైదానంలో పసికూనల సమరం.. విజయావేశంతో గర్జించిన క్రీడాకారులు



*** గజ్వేల్ డివిజన్ స్పోర్ట్స్ మీట్‌లో హోరాహోరీగా సాగుతున్న పోటీలు**
*** ఆకట్టుకుంటున్న విద్యార్థుల క్రీడా పటిమ.. రేపే ముగింపు వేడుకలు**
**సిద్దిపేట/ జగదేవపూర్,**
**సెప్టెంబర్ 12 (వుదయం ప్రతినిధి)**

క్రీడా మైదానం సమరక్షేత్రాన్ని తలపించింది.. పాయింట్ పాయింట్‌కూ గుండెచప్పుడు వేగమందుకుంది.. గెలుపే లక్ష్యంగా చిన్నారి క్రీడాకారులు ప్రదర్శించిన పోరాట పటిమ చూపర్లను మంత్రముగ్ధులను చేసింది! గజ్వేల్ 'ట్రస్మా' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గజ్వేల్ డివిజన్ స్థాయి స్పోర్ట్స్ మీట్‌లో శనివారం ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు క్రీడాజ్యోతులై వెలిగారు. మైదానంలోకి దిగిన క్షణం నుంచే విజయం కోసం పట్టువదలకుండా శ్రమించిన చిన్నారుల ఆటపాటలు, ఉత్సాహం మైదానాన్ని ఊపేసాయి. ప్రత్యర్థి జట్లను చిత్తు చేస్తూ విజయం సాధించిన వేళ క్రీడాకారులు చేసిన కేరింతలు, ఆనంద తాండవాలు పండగ వాతావరణాన్ని తలపించాయి. కబడ్డీ కూతల్లో వేడి, వాలీబాల్ సర్వీసుల్లో వాడి, ఖోఖో పరుగుల్లో వేగం పోటీలకు అదనపు ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా ఆర్గనైజర్ ప్రభాకర్ రెడ్డి, గజ్వేల్ డివిజన్ ట్రస్మా అధ్యక్షుడు మనోజ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని వివిధ పాఠశాలల నుంచి సుమారు 100కు పైగా జట్లు ఈ క్రీడా సమరంలో తలపడుతున్నాయని తెలిపారు. క్రీడలు విద్యార్థుల్లో శారీరక దార్ఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని నింపుతాయని పేర్కొన్నారు. ఆదివారంతో ఈ స్పోర్ట్స్ మీట్ ముగియనుందని, సాయంత్రం జరిగే వైభవ ముగింపు వేడుకల్లో విజేతలకు బహుమతుల ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు, ఫిజికల్ డైరెక్టర్లు (PETs), ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని క్రీడాకారులకు ఉత్సాహాన్ని అందించారు.

# మెదక్ నూతన ఎస్సీ మోర్చా జిల్లా కమిటీ నియామకం : మాస్కూరి బాలరాజు



**గురు రవిదాస్ మహారాజ్ 650వ జయంతి మట్టి కలశ యాత్రకు శ్రీకారం**
**రామాయంపేట,సెప్టెంబర్ 12**
**(వుదయం ప్రతినిధి రాజాగౌడ్):**

భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా మెదక్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు, దంతేపల్లి సర్పంచ్ మస్కూరి బాల్‌రాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్‌గౌడ్, ముఖ్య అతిథిగా పాల్గొన్నారు రాష్ట్ర అధ్యక్షులు కాంతి కిరణ్ ఆదేశాలు, రాష్ట్ర ఇన్‌చార్జి సురేఖ సూచనల మేరకు ఎస్సీ మోర్చాలో 35 మందితో జిల్లా కమిటీని ఏర్పాటు చేసినట్లు నాయకులు తెలిపారు. కమిటీలో సామాజిక సమతుల్యతకు ప్రాధాన్యం ఇస్తూ 8 మంది మహిళలకు, 26 మంది పురుషులకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. నూతనంగా నియమితులైన సభ్యులకు నియామక పత్రాలను అందజేసి, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.గురు రవి దాస్ మహారాజ్ మట్టి కలశం అందజేత
సంత్ శిరోమణి గురు రవిదాస్ మహారాజ్ 650వ జయంతి సందర్భంగా రాష్ట్ర పార్టీ నుంచి తీసుకువచ్చిన పవిత్ర మట్టి కలశాన్ని జిల్లా పార్టీకి అందజేశారు. జిల్లా కేంద్రం నుంచి మండలాలు, గ్రామాల వారీగా మట్టి కలశ యాత్రను నిర్వహించి విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.గురు రవిదాస్ మహారాజ్ సమాజంలో సామాజిక సమరసత, సమానత్వం, సోదర భావం కోసం బోధనలు చేశారని, బడుగు బలహీన వర్గాలను ఆధ్యాత్మిక చింతన వైపు నడిపించి సమాజంలో మార్పునకు కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. ఆయన చూపిన సమానత్వం, సామాజిక సమరసత మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు రాష్ట్ర నాయకులు ప్రణయ్‌కుమార్, జిల్లా నాయకులు,మోర్చా అధ్యక్షులు, మండల అధ్యక్షులు,శక్తి కేంద్రాల ఇన్‌చార్జీలు, బూత్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మట్టి గణపతితో.. పర్యావరణ పరిరక్షణ



**-- పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులే మేలు.. చైర్మన్ పుల్కం రాజు.**
**వేములవాడ, సెప్టెంబర్ 12**
**(వుదయం ప్రతినిధి) :**

పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజలు మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు కోరారు. వినాయక చవితిని పురస్కరించుకుని వేములవాడ మున్సిపల్ పాలకవర్గం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. చైర్మన్ పుల్కం రాజు, కమిషనర్ లోకేష్, కౌన్సిలర్లతో కలిసి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పట్టణ ప్రజలకు మున్సిపల్ పాలకవర్గం, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తరఫున వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, రసాయనాలతో తయారు చేసిన విగ్రహాల నిమజ్జనం వల్ల నీటి వనరులు కలుషితమై పర్యావరణానికి నష్టం కలిగే అవకాశం ఉందన్నారు. కాలుష్య రహిత వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ మట్టి గణపతులకే ప్రాధాన్యమివ్వాలని పిలుపునిచ్చారు.తొలిసారిగా మట్టి గణపతి ప్రతిష్ఠమున్సిపల్ పాలకవర్గం ఏర్పడిన తర్వాత ఈ ఏడాది తొలిసారిగా మున్సిపల్ కార్యాలయంలో మట్టి వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు నిర్వహించనున్నట్లు పుల్కం రాజు తెలిపారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడమే కార్యక్రమం ఉద్దేశమన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లోకేష్, కౌన్సిలర్లు తూమ్ మధు, కొండ రాజశేఖర్, తోట రాజు,ఎల శ్రీనివాస్, కొక్కుల బాలకృష్ణ, మైలారం శ్రీనివాస్, , కోఆప్షన్ సభ్యులు కట్కూరి శ్రీనివాస్, ఫీర్ మహమ్మద్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# లోక్ అదాలత్‌తో సమయం వనరులు ఆదా: జిల్లా ప్రధాన జడ్జి సుదర్శన్




*** సామరస్య పూర్వక పరిష్కారానికి లోక్ అదాలత్ వేదిక**
*** కోర్టు ఆవరణలో దివ్యాంగులకు ఉపాధి మేళా.. 30 మందికి ఉద్యోగాలు**
**సిద్దిపేట,**
**సెప్టెంబర్ 12 (వుదయం బ్యూరో)**

లోక్ అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించుకోవడం వల్ల సమయం, ధనం వృథా కాకుండా ఇరువర్గాల మధ్య సామరస్యం పెరుగుతుందని జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థ చైర్మన్ సుదర్శన్ తెలిపారు. శనివారం సిద్దిపేట జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ, రాజీపడే అవకాశం ఉన్న సివిల్, క్రిమినల్ కేసులలో ఇరువర్గాలు ముందుకు వచ్చి 'వన్ టైమ్ సెటిల్మెంట్' ద్వారా సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. కేసుల పరిష్కారంతో పాటు సామాజిక సంక్షేమంలో భాగంగా దివ్యాంగుల సంక్షేమ దరఖాస్తుల స్వీకరణ, 'ఆర్ సేటి' ద్వారా ఉపాధి శిక్షణ, ఎంప్లాయ్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రత్యేక జాబ్ మేళా నిర్వహించినట్లు జడ్జి వెల్లడించారు. సమర్థనం ట్రస్ట్, ఐసిఐసిఐ ప్రొడెన్షియల్, వేదాస్ సొల్యూషన్, మెడిప్లేస్ కంపెనీల ద్వారా 175 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించి 30 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామని, లీడ్ బ్యాంక్ ద్వారా రుణాల కల్పనకు శ్రీకారం చుట్టామని తెలిపారు. అనంతరం కోర్టు ఆవరణలోని వివిధ శాఖల స్టాళ్లను ఆయన పరిశీలించారు. కాగా, సిద్దిపేట జిల్లా కోర్టుతో పాటు దుబ్బాక, గజ్వేల్, చేర్యాల, హుస్నాబాద్ కోర్టులలో నిర్వహించిన లోక్ అదాలత్ ద్వారా అనేక కేసులు పరిష్కారమయ్యాయి. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జి జయ ప్రసాద్, న్యాయ సేవా సంస్థ కార్యదర్శి సౌజన్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌బాబు, న్యాయవాదులు, అధికారులు పాల్గొన్నారు.

# కేసీఆర్ పాలనే తెలంగాణ స్వర్ణయుగం



*** గజ్వేల్ బీఆర్ఎస్ ఇన్చార్జ్ సమక్షంలో భారీగా చేరికలు**
*** శేరిపల్లి నుంచి బీఆర్ఎస్‌లో చేరిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు**
**గజ్వేల్,**
**సెప్టెంబర్ 12 (వుదయం ప్రతినిధి)**

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనా కాలమే రాష్ట్రానికి నిజమైన స్వర్ణయుగమని గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్చార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి కొనియాడారు. వర్గల్ మండలం శేరిపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ బోయిని కుమార్, బీజేపీ వార్డు మెంబర్ లావణ్య నర్సింలు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కనుకయ్యతో పాటు పలువురు నాయకులు గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం వంటేరు ప్రతాప్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతుబీమా, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఆసరా సాగునీరు, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ వంటి సంక్షేమ ఫలాలను మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా గడపగడపకూ అందించారని గుర్తుచేశారు. దేశంలోనే తెలంగాణను నంబర్ వన్ రాష్ట్రంగా నిలిపిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. అబద్ధపు హామీల పునాదులపై అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాలు ప్రజలకు పాలన అందించడంలో పూర్తిగా విఫలమయ్యాయని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఫల్యాలు చూసి ప్రజలు మళ్లీ కేసీఆర్ పరిపాలనను గుర్తుచేసుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వర్గల్ మండల పార్టీ అధ్యక్షుడు వేలూరు వెంకటరెడ్డి, శేరిపల్లి సర్పంచ్ పావని మోహన్‌రెడ్డి, జిల్లా యువజన అధ్యక్షుడు నాగరాజు, వర్గల్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## ముస్తాబవుతున్న గణేష్ మండపాలు



**జన్నారం,**
**సెప్టెంబర్ 11 (వుదయం విలేఖరి)**

జన్నారం మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక మండపాలు ముస్తాబవుతున్నాయి. సోమవారం నుంచి గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో నిర్వాహకులు మండపాలను అందంగా తీర్చిదిద్దుతున్నారు.పది రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాట్లు చేస్తున్నా సాయంత్రం అల్పాహారం భక్తులకు ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.యువకులు, చిన్నారులు ఎంతో ఉత్సాహంగా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మండపాల ఏర్పాటుకు పోలీసుల నుంచి తప్పక అనుమతి తీసుకోవాలని, గణేష్ నవరాత్రులను ప్రశాంత వాతావరణంలో ఆధ్యాత్మికతతో జరుపుకోవాలని అధికారులు కోరారు.

# చట్టసభల్లో 50 శాతం బీసీ రిజర్వేషన్లు కల్పించాలి




చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ హక్కుల పోరాట వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు తోట శ్రీనివాస్ పటేల్, వైస్ చైర్మన్ కొల్లకుంట నాగరాజు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్ బషీర్బాగ్ ప్రెస్ క్లబ్లో వారు మీడియాతో మాట్లాడారు. కేంద్రం కుల గణనలో ఓబీసీ కాలం చేర్చాలని కోరారు. బీసీ మహిళలకు 50% రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. బీసీలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, సబ్సిడీ రుణాలు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. బడుగు బలహీన వర్గాల పేద విలకు తక్షణమే పెండింగ్లో ఉన్న ఫీజులను చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. బీసీలు తమ పిల్లలను చదివించాలని, అప్పుడే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందవచ్చన్నారు. బీసీల హక్కుల సాధనకు, సమస్యల పరిష్కారానికి బీసీ హక్కుల పోరాట వేదిక ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో నాగేశ్వర రావు, రోహిత్, కొటం రమేష్, రాజు బెస్త, నాగరాజు వడ్డేపల్లి తదితరులు పాల్గొన్నారు.

## రాజీమార్గమే.. రాజమార్గం. సీనియర్ సివిల్ జడ్జి ప్రతీక్ సిహాగ్.




**నర్సంపేట ,సెప్టెంబర్ 12 (వుదయం ప్రతినిధి):**

జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం నర్సంపేట కోర్టులో నిర్వ హించిన లోక్ అదాలత్‌లో మొత్తం 655 కేసులు పరిష్కారమయ్యాయి. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన సీనియర్ సివిల్ జడ్జి, తాలూకా లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్ ప్రతీక్ సిహాగ్ మాట్లాడుతూ "రాజీమార్గమే రాజమా ర్గం" అని అన్నారు. రాజీ పడదగిన కేసుల్లో ఇరుపక్షాలు పరస్పర అంగీకా రంతో రాజీ కుదుర్చుకుంటే కేసులను వెంటనే పరిష్కరించి కక్షిదారులకు సత్వర న్యాయం

అం దిం చ వ చ్చన్నారు . లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వి నియోగం చేసుకుని, కేసుల భారాన్ని తగ్గించుకోవాలని సూచించారు. నర్సం పేట కోర్టులో నిర్వహించిన లోక్ అదా లత్‌లో 74 రాజీ కేసులు, 150 నేరం ఒప్పుకున్న కేసులు, 1 సివిల్ కేసు, 14 బ్యాంకు కేసులు, 411 పెట్టీ కేసులు, 5 ఎక్సైజ్ కేసులు పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.డి. యూసుఫ్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి గిరిధర్,

బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సిలువేరు కిరణ్ కుమార్, లోక్ అదాలత్ సభ్యులు షేక్ రహీముద్దీన్, దొంతి సాంబయ్య, మోటూరి రవి, ఏజీపీ అంబటి రాజకుమార్, న్యాయవాదులు టి. సునీత, అంబాల సుధీర్, పండుగ శ్రీనివాస్, పాలడుగుల ప్రవీణ్, సీఐలు, ఎస్సైలు, బ్యాంకు సిబ్బంది, కక్షిదారు లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## మృతదేహంపై పూలమాల మృతదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించిన ఆరూరి రమేష్



**నెక్కొండ , సెప్టెంబర్ 12 (వుదయం ప్రతినిధి.):**

నెక్కొండ మండలంలోని సూరిపెల్లి గ్రామంలో వర్ధన్నపేట నియోజక వర్గ మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్ శనివారం పర్వతగిరి మండలం వడ్లకొండ గ్రామానికి చెందిన ఏ ఎం సీ మాజీ డైరెక్టర్ ఏకాంతం గౌడ్ మామ గారైన దొమ్మటి కొమురయ్య మరణించ గా వారి పార్థివ దేహానికి నివాళులర్పిం చి వారి కుటుంబ సభ్యులను పరామ ర్శించి సానుభూతి వ్యక్తం చేశారు.
ఈ పరామర్శలో పాక్స్ చైర్మన్ యం. మనోజ్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షు లు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు, మండల మాజీ రైతు బంధు అధ్యక్షులు చిన్నపాక శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ మాడుగుల రాజు, మాజీ మండల అధ్యక్షులు రంగు కుమార్ గౌడ్. మండల సీనియర్ నాయకులు చీమల బిక్షపతి.ఫర్టిలైజర్ రంగు కుమార్ గౌడ్. పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన భూమిపూజను విజయవంతం చేయండి



**– ఆర్యవైశ్య నాయకులు పిలుపు**

**పర్వతగిరి , సెప్టెంబర్ 12 ( వుదయం ప్రతినిధి ):**

ఆర్యవైశ్యుల ఐక్యతను చాటుతూ, ఆత్మ గౌరవాన్ని బలోపేతం చేసేందుకు ఈ నెల 13న హైదరాబాద్‌లో నిర్వహిం చనున్న 'ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన సముదాయ నిర్మాణ భూమిపూజ' కార్యక్రమానికి స్వచ్ఛందంగా తరలి రావాలని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య యువజన విభాగ కార్యదర్శి చీదురాల వేణుగోపాల్, జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు దారం పూర్ణచందర్ పిలు పునిచ్చారు.
ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాజకీయాలు, విభేదా లకు అతీతంగా ఆర్యవైశ్యులంతా ఏక తాటిపై నిలవాలని, సంఘటిత శక్తితోనే సామాజిక సమస్యలను పరిష్కరించుకో గలమని పేర్కొన్నారు. మండలంలోని ఆర్యవైశ్య కుటుంబాలన్నీ పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని వి జయవంతం చేయాలని కోరారు.

## మృతదేహంపై పూలమాల వేసిన సర్పంచ్ వినోద్ కుమార్



**ఖానాపురం, సెప్టెంబర్ 12 (వుదయం ప్రతినిధి.):**

మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన కర్నే నరసమ్మ(87) అనారో గ్యంతో మృతి చెందిగా మృతదేహాన్ని గ్రామ సర్పంచ్ జాటోత్ వినోద్ కుమార్ సందర్శించి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి

మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆరె సంపత్ కుమార్, వార్డు సభ్యుడు జాటోత్ బాలు, నాయకులు గద్దం మల్లేష్, సుదర్శన్ రెడ్డి, దుద్దు విజేందర్, దొంతరబోయిన రవి తదిత రులు పాల్గొన్నారు.

## పంచాయతీలకు శుభవార్త.. నిధులపై వెసులుబాటు!



**గ్రామాల ఖాతాల్లోకే ఆదాయం..**
**అభివృద్ధికి మరింత ఊతం**
**ప్రభుత్వ నిర్ణయంపై హర్షం**
**మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు మట్టపెల్లి వెంకటేశ్వర్రావు**

**పర్వతగిరి , సెప్టెంబర్ 12 ( వుదయం ప్రతినిధి ):**

తెలంగాణలోని గ్రామ పంచాయతీల కు ప్రభుత్వం శుభవార్త అందించిందని మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు చౌటపల్లి సర్పంచ్ మట్టపెల్లి వెంక టేశ్వర్ రావు హర్షం వ్యక్తం చేశారు. పంచాయతీలకు వచ్చే ఆదాయాన్ని ఇకపై ట్రెజరీలో జమ చేయకుండా నేరుగా వాటి బ్యాంకు ఖాతాల్లోనే జమ చేసుకునే వెసులుబాటు కల్పిస్తూ పం చాయతీరాజ్ చట్టం2018 సవరణ బిల్లును అసెంబ్లీ ఆమోదించడం అభి నందనీయమన్నారు. ఇప్పటివరకు పంచాయతీల ఆదాయాన్ని ట్రెజరీలో జమ చేసిన అనంతరం అవసరాలకు నిధులు డ్రా చేసుకోవడంలో అనేక ఇబ్బందులు ఎదురయ్యేవని తెలిపారు. తాజా నిర్ణయంతో గ్రామసభ తీర్మానం మేరకు నిధులను వినియోగించుకునే అవకాశం ఏర్పడటం వల్ల స్థానిక అవస రాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు వేగవంతం అవుతాయని పేర్కొన్నారు. పంచాయతీలకు వచ్చే ప్రతి రూపాయి గ్రామాల అభివృద్ధికే ఉపయోగపడేలా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ప్రజ లకు ఎంతో మేలు

చేస్తుందని శేఖర్‌రావు అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు, పారిశుధ్యం, తాగునీరు తదితర అభి వృద్ధి కార్యక్రమాలకు ఇది మరింత ఉప యోగకరంగా మారుతుందని మట్టపెల్లి వెంకటేశర్ రావు తెలిపారు.

## గణేష్ మండపాల ఏర్పాటుకు పోలీస్ శాఖ విద్యుత్ శాఖ నియమాలను పాటించాలి




**పర్యావరణాన్ని కాపాడే విధంగా మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలి.**
**స్థానిక ఎస్ఐ జి రామ్మోహన్.**

**ఖానాపురం, సెప్టెంబర్ 12 (వుదయం ప్రతినిధి):**

మండలంలోని 21 గ్రామ పంచాయ తీల పరిధిలోని గణేష్ నవరాత్రుల గణేష్ మండపాల ఏర్పాటుకు పోలీస్ శాఖ, విద్యుత్ శాఖ నియమ నిబంధ నలను తప్పనిసరిగా పాటించాలని స్థానిక ఎస్ఐ జి రామ్మోహన్ 21 గ్రామ పంచాయతీల పరిధిలోని గణేష్ మండపాల ఏర్పాటు బాధ్యులకు కమి టీలకు గ్రామస్తులకు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్ఐ మాట్లాడు తూ పర్యావరణాన్ని కాపాడే విధంగా మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలని ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా చూడాలని తెలుపుతూ...గణేష్ నవరాత్రుల మండపాల ఏర్పాటు కోసం ముందస్తుగా పోలీస్ శాఖ విద్యుత్ శాఖ అధికారుల అనుమతులు తప్పనిసరి గా తీసుకోవాలని తెలుపుతూ, గణేష్ మండపాల ఏర్పాటు గాలి దుమారానికి వర్షానికి తట్టుకునే విధంగా మండపాల నిర్మాణం చేసుకోవాలని,

మండపాల వద్ద ప్ర మాదాలు జరగకుండా నాణ్యమైన విద్యుత్ వైర్లను వాడాలని, మండపాల వద్ద చోరీలు జరగకుండా భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, రహదారుల వెంట గణేష్ మండపాల ఏర్పాటు చేస్తున్నవారు రోడ్డు భద్రత ప్ర మాణాలను పాటించాలని, ఉదయం సాయంత్రం పూజా కార్యక్రమం ఉన్న ప్పుడే మైకులను వాడుకోవాలని మైకుల ద్వారా విద్యార్థులకుగాని ప్రజలకుగాని ఇతరులకుగాని ఇబ్బంది కలగకుండా గణేష్ కమిటీ బాధ్యతలు చూసుకోవా లని ఎస్ఐ తెలిపారు.

## నేడు ప్రత్యేక ఓటర్ నమోదు : తాసిల్దార్ రామ్మోహన్ రావు



**బెజ్జూర్ (వుదయం ప్రతినిధి):**

బెజ్జూరు మండలంలోని 38 పోలింగ్ కేంద్రాల్లో నేడు ఆదివారం కూడా ఎలక్షన్ కమిషన్ ఆదేశాల ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్ర మం నిర్వహించనున్నట్లు తాసిల్దా ర్ రామ్మోహన్ రావు తెలిపారు. ఒకటి అక్టోబర్ 2026 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు కొత్త ఓటుకోసం పారం 6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.
అదే విధంగా ఆన్ లైన్ లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.
శనివారం బెజ్జూర్ మండలం లోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఎస్ఐఆర్ ప్రక్రియను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. నోటీసులు అందిన వారిని సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో అందజేయాలని, ఎలాంటి పొరపాట్లు లేకుండా ఆన్లైన్లో నమోదు చేయాలని, ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కలిగి ఉండేలా జాగ్రత్తలు తీసుకోవా లని సూచించారు. ప్రభుత్వనిబంధన ప్రకారం పక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సర్ నోటీసులు వచ్చినవారు ఆదివారం ఉదయం 11 గంటలకు బెజ్జూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో హా జరుకావాలని తాసిల్దార్ రామ్మోహన్ రావు తెలిపారు. బి ఎల్ ఓ లు మారుతి, జావీద్ ,కాంత కుమారి ఉన్నారు.

## ఇదేనా కాంగ్రెస్ ప్రజాపాలన?



**ప్రతిపక్ష సర్పంచ్‌కు సమాచారం లేకుండానే స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ**
**ఎమ్మెల్యే ఆదేశాలున్నాయంటూ అధికారులు చెప్పారన్న సర్పంచ్**
**తహశీల్దార్ కార్యాలయం ఎదుట సర్పంచ్, పాలకవర్గ సభ్యుల బైఠాయింపు**

**నాగిరెడ్డిపేట,సెప్టెంబర్ 12 ( వుదయం ప్రతినిధి ):**

ప్రజాపాలన అందిస్తున్నామని చెబు తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రతిపక్ష పార్టీకి చెందిన గ్రామ సర్పంచ్‌కు కనీస సమాచారం ఇవ్వకుండా ప్రభుత్వ కార్య క్రమాలు నిర్వహించడం ఏ తరహా ప్రజా పాలన అని ధర్మారెడ్డి గ్రామ సర్పంచ్ గుల్లపల్లి లక్ష్మీనారాయణ ప్రశ్నించా రు. గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించ డంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.ధర్మారెడ్డి గ్రామంలో గత రెండు, మూడు రోజులుగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ జరుగుతున్నప్పటికీ గ్రామ సర్పంచ్‌గా తనకు సమాచారం ఇవ్వలేదని లక్ష్మీనారాయణ తెలిపారు. తాను బీఆర్ఎస్‌కు చెందిన సర్పంచ్ అయినంత మాత్రాన ప్రభుత్వ కార్యక్ర మాల సమాచారం ఇవ్వకపోవడం సరి కాదన్నారు. అధికార పార్టీకి చెందిన ప్ర జాప్రతినిధులకే ప్రభుత్వ కార్యక్రమాల సమాచారం అందించాలా.. ప్రతిపక్ష ప్రజాప్రతినిధులకు ఇవ్వకూడదా అని ప్ర శ్నించారు.రెవెన్యూ శాఖకు సంబంధిం చిన స్మార్ట్ రేషన్ కార్డులను సంబంధిత అధికారులు పంపిణీ చేయాల్సి ఉండగా.. అధికారుల సమక్షంలోనే కాంగ్రెస్ కార్యకర్తల ద్వారా కార్డులు పంపిణీ చేయడం ఏమిటని ఆయన నిలదీశారు.ఎమ్మెల్యే ఆదేశాలు ఉన్నా స్థానిక సర్పంచ్‌కు సమాచారం ఇవ్వ కుండా కార్యక్రమం నిర్వహించాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు.తాను ప్రశ్నించిన సమయంలో ''మా ఇష్టం.. మా ఎమ్మెల్యే మాకే ఇవ్వమన్నారు. ఏం చేసుకుంటావో చేసుకో'' అంటూ కార్యకర్తలు సమాధానం ఇచ్చారని సర్పంచ్ ఆరోపించారు. ఈ వ్యవహారం అధికారుల సమక్షంలోనే జరిగినప్పటి కీ ఎలాంటి స్పందన లేకపోవడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రభు త్వ సంక్షేమ పథకాల పంపిణీ రాజకీయ పార్టీ కార్యక్రమంగా

మారకూడదని, అర్హులైన ప్రతి ఒక్క రికీ సమానంగా ప్రభుత్వ పథకాల ప్రయోజనం అందాలని లక్ష్మీనారా యణ అన్నారు. గతంలో కల్యాణలక్ష్మి, సీఎంఆర్ చెక్కుల పంపిణీ వంటి కార్య క్రమాల విషయంలో తాము జోక్యం చే సుకోలేదని గుర్తుచేశారు. అయినప్పటికీ ప్రస్తుతం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి కనీస సమాచారం ఇవ్వకపోవడం బా ధాకరమన్నారు.
తహశీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయింపు
స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ వ్యవహా రంపై ధర్మారెడ్డి సర్పంచ్ గుల్లపల్లి లక్ష్మీనారాయణ, ఉపసర్పంచ్ జోడు జయరాజు, పాలకవర్గ సభ్యులు నా గిరెడ్డిపేట తహశీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసు కోవాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ కార్యక్రమాల్లో రాజకీయ జోక్యాన్ని అరికట్టి.. గ్రామ ప్రజాప్రతినిధులకు సముచిత గౌరవం, సమాచారం కల్పిం చాలని కోరారు. ప్రతిపక్ష సర్పంచ్ ఉన్న గ్రామంలో ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించేటప్పుడు కనీస సమాచారం ఇవ్వకపోవడమేనా ప్రజాపాలన? అని లక్ష్మీనారాయణ ప్రశ్నించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో పార్టీ రాజకీయాలను కలపకుండా అధికార యంత్రాంగం వ్యవహరించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతమైతే ప్రజల తరఫున మరింత గట్టిగా పోరాటం చేస్తామని

## ఓటర్ల జాబితా ప్రక్రియలో జాప్యం వద్దు



**- SIR ప్రక్రియపై కలెక్టర్ రాజర్షి షా సీరియస్**

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 12 (వుదయం ప్రతినిధి):**

ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (SIR) ప్రక్రియలో ఎలాంటి జాప్యానికి తావివ్వకుండా పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించా రు. నోటీసుల డెలివరీ, హియరింగ్‌లు, దరఖాస్తుల పరిష్కారంలో ఆశించిన స్థాయిలో పురోగతి లేకపోవడంపై అసం తృప్తి వ్యక్తం చేశారు. శనివారం తహసీ ల్దార్లు, ఏఈఆర్వోలు, సంబంధిత అధికా రులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్.. ఆదిలాబాద్, బోథ్ నియోజకవ ర్గాల్లో మండలాల వారీగా SIR పురోగ తిని సమీక్షించారు. ఆదిలాబాద్ అర్బన్ మండలంలో ఏఈఆర్వో పరిధిలో సుమారు 26 వేల నోటీసులు డెలివరీకి పెండింగ్‌లో ఉండగా.. ఇప్పటివరకు 600 హియరింగ్‌లు మాత్రమే పూర్తికా వడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నవంబర్ 5 తుది గడువును దృష్టిలో పెట్టుకుని ప్రతిరోజూ నిర్దేశిత లక్ష్యాల ను తప్పనిసరిగా చేరుకోవాలని స్పష్టం చేశారు. మండలాల వారీగా రోజుకు కనీసం 900 నోటీసుల డెలివరీ, దరఖా స్తుల పరిష్కారం జరిగేలా కార్యాచరణ రూపొందించుకోవాలని ఆదేశించారు. పురోగతిని ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు.
బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి పెండింగ్ నోటీసులను వంద శాతం అందజేయాలని, అనంతరం హి యరింగ్‌లను నిర్ణీత సమయంలో పూర్తి చేసి దరఖాస్తులను వెంటనే పరిష్కరిం చాలని ఆదేశించారు. బోథ్‌తో పాటు నియోజకవర్గంలోని ఇతర మండలా ల్లోనూ పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.
కొత్త ఓటర్ల నమోదుకు ఫారం 6 , తొలగింపులు, అభ్యంతరాలకు ఫారం 7, సవరణలకు ఫారం8 కింద వచ్చిన దరఖాస్తులను నిబంధనల మేరకు పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు. సంబంధిత పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా, అనర్హుల పేర్లను నిబంధనల ప్రకారం తొలగించేలా పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా రోజువారీ లక్ష్యాలను సాధించాలని అధికారులను ఆదేశించారు.సమా వేశంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఆర్డీవో జగదీశ్వర్ రావు, రెవెన్యూ అధి

## అర్హులకే చేయూత.. అనర్హులకు చెక్



**కొత్తూరులో పెన్షన్ దరఖాస్తులపై క్షేత్రస్థాయి విచారణ**

**రాయపర్తి సెప్టెంబర్ 12 (వుదయం ప్రతినిధి):**

మండలం కొత్తూరు గ్రామంలో చేయూత పెన్షన్ దరఖాస్తుల అర్హతల పై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీ లన చేపట్టారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా అందించాలనే లక్ష్యంతో దరఖాస్తు లపై సమగ్ర విచారణ నిర్వహించా రు.మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ) కూచన ప్రకాష్ గ్రామానికి చేరుకుని పెన్షన్ కోసం వచ్చిన దరఖా స్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దరఖాస్తుదారుల అర్హతలు, వివరాలను పరిశీలిస్తూ వాస్తవ పరిస్థితులను తెలు సుకున్నారు. అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారు డికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.పెన్షన్ అర్హతల పరిశీలనలో ఎలాంటి అవకతవకలకు తావులేకుం డా నిబంధనల ప్రకారం దరఖాస్తులను పరిశీలిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నా రు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కందికట్ల స్వప్న సంతోష్ , వార్డు సభ్యులు చిర్రా నాగరాజు, దొమ్మటి లలిత రమేష్, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ నాయకుని తల్లి మృతి



**ఖానాపురం, సెప్టెంబర్ 12 (వుదయం ప్రతినిధి):**

మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు కర్నె వెంకటేశ్వర్లు తల్లి నరసమ్మ(87) అనారోగ్యంతో మృతిచెందగా మృత దేహాన్ని నియోజకవర్గ నాయకుడు రాయిడి రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు, ఓడీసీఎం ఎస్ మాజీ చైర్మన్ గూగులోతు రామ స్వామినాయక్, ఏఎంసీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్, సర్పంచ్ల ఫోరం మండల ప్రధాన కార్యదర్శి దాసరి రమేష్ లు మృతదేహాన్ని సందర్శించి మృతదేహంపై పూలమాలవేసి నివా ళులర్పించి మృతురాలి కుటుంబ సభ్య లను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రామసయం ఉపేందర్ రెడ్డి, బీసీ సెల్ మండల అధ్య క్షుడు కోరే సుధాకర్, మండల యూత్ అధ్యక్షుడు కోరే రాము, గ్రామ పార్టీ అధ్య క్షులు జాటోత్ రమేష్, బంధారపు శ్రీని వాస్ గౌడ్, నాయకులు బూస అశోక్, జాటోత్ బాలు, సొంటి లక్ష్మణ్, రాము, దేవేందర్, రవి, సదర్ లాల్, కట్టయ్య, కు మారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్‌ల అడుగులు.. కాంగ్రెస్ వైపు



**- మాజీ ఎంపీ సోయం సమక్షంలో వరుస చేరికలు**

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 12 (వుదయం ప్రతినిధి):**

మాజీ ఎంపీ సోయం బాపూరావు రాజకీయ దూకుడు పెంచారు. ప్రత్యర్థి పార్టీలకు చెందిన స్థానిక ప్రజాప్రతిని ధులను కాంగ్రెస్ గూటికి చేర్చుకుంటూ రాజకీయంగా తనదైన ముద్ర వేస్తున్నా రు. ఒకేరోజు మూడు గ్రామాల సర్పం చ్‌లు కాంగ్రెస్ తీర్థం
పుచ్చుకోవడం మండల రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.
ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సోయం బాపూరావు క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో భూతాయి కే సర్పంచ్ మాదవి జైతు, గిర్జయి సర్పంచ్ పెందూర్ అరవింద్, ధర్మపురి సర్పంచ్ ఆర్కా యాదవ్, కుమ్ర మారుతి కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోయం బాపూరావు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సోయం బాపూరావు మా ట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమా లకు ప్రజల్లో ఆదరణ లభిస్తోందన్నారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను గ్రామస్థాయిలో ప్రజలకు వివరించి పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు.

రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు తదితర కార్యక్రమాలను ప్రజ ల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. కాంగ్రెస్‌ను మరోసారి అధికారంలోకి తీసుకురావ డానికి కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్ర మంలో జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, మైనారిటీ సీనియర్ నాయకుడు మొహమ్మద్, పెందూర్ పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



**కామారెడ్డి, సెప్టెంబర్ 11 (వుదయం ప్రతినిధి):-**

వినాయక చవితి పండుగ సందర్భం గా పర్యావరణ పరిరక్షణలో భాగంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ మట్టి వినాయక విగ్రహాలను శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో పంపిణీ చేశారు.ఈ సందర్భంగా చైర్ప ర్సన్ మాట్లాడుతూ,

మట్టి వినాయక విగ్రహాల ను వినియోగించడం ద్వారా పర్యావ రణాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ పర్యావరణహితమైన మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించి వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపు కోవాలని కోరారు. పర్యావరణ పరి రక్షణ మనందరి బాధ్యత అని, మట్టి విగ్రహాల వినియోగాన్ని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని మున్సిపల్ చైర్‌పర్స న్ సూచించారు. ఈ కార్యక్రమంలో ము న్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కాసర్ల గోదావరి స్వామి, కౌన్సిలర్ అంజాద్, కమిషనర్ పర్వతాలు, డీఈ హన్మంత్ రావు, ఆర్వో గోపాల్ రెడ్డి, టిపివో దేవరాజు, ఎస్సై ప్రశాంత్, భాగ్యలక్ష్మి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గణపతి మండపాలకు ఆన్‌లైన్ నమోదు తప్పనిసరి



**నిబంధనలు అతిక్రమిస్తే కేసులు..**
**డీజేలకు అనుమతి లేదు**
**విద్యుత్ తీగలకు దూరంగా మండపాలు ఏర్పాటు చేయాలి**
**నాగిరెడ్డిపేటలో గతేడాది 88 మండపాలు.. ఈసారి ఇప్పటివరకు 32 మాత్రమే ఆన్‌లైన్ నమోదు**

**నాగిరెడ్డిపేట,వుదయం**

వినాయక చవితి సందర్భంగా గణపతి మండపాలు ఏర్పాటు చేసే నిర్వా హకులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సీఐ రాజిరెడ్డి సూచించారు. శనివారం నాగిరెడ్డిపేట మండలంలోని వివిధ గ్రామాల గణపతి మండపాల నిర్వాహకులు, యువజన నాయకులతో నిర్వహించిన సమావే శంలో ఆయన మాట్లాడారు. ఎల్లారెడ్డి సర్కిల్ పరిధిలో గతేడాది మొత్తం 389 గణపతి మండపాలు ఏర్పాటు కాగా, నాగిరెడ్డిపేట మండలంలోనే 88 మండపాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అయితే ఈ ఏడాది నాగిరె డ్డిపేట మండలంలో ఇప్పటివరకు 32 మండపాలకు మాత్రమే ఆన్‌లైన్ నమోదు పూర్తయిందని పేర్కొ న్నారు. మండపాల నిర్వాహకులు ముం దస్తుగా ఆన్‌లైన్ నమోదు చేసుకోవాలని సూచించారు.
డీజేలకు అనుమతి లేదు
గణపతి ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదని సీఐ రాజిరెడ్డి స్పష్టం చేశారు. ని బంధనలకు విరుద్ధంగా డీజేలు ఏర్పాటు చేస్తే నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మండపాల వద్ద పేకాట, మద్యం సేవించడం వంటి వాటికి తావివ్వకూడదన్నారు.భద్రతపై అప్రమత్తత అవసరం విద్యుత్ తీగలకు సమీపంలో మండపాలు ఏర్పాటు చేయ వద్దని సూచించారు.
మండపాల వద్ద భద్రత కోసం ఇద్దరు వ్యక్తులు అందుబాటులో ఉండేలా చూ సుకోవాలని తెలిపారు. దొంగతనాల నివారణకు సీసీ కెమెరాలు, సోలార్ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.
రహదారులకు ఆటంకం కలిగించొద్దు
మండపాలను రహదారులను పూర్తిగా ఆక్రమించేలా ఏర్పాటు చేయవద్దని సీఐ సూచించారు. అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు, ఇతర వాహనాలు వెళ్లేందుకు వీలుగా తగినంత స్థలం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాట్సాప్ తదితర సామాజిక మాధ్యమా ల్లో వచ్చే సమాచారాన్ని నిర్ధారించుకో కుండా ఫార్వర్డ్ చేయవద్దని, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు.సమావేశం లో ఎస్సై భార్గవ్‌గౌడ్, వివిధ గ్రామాల గణపతి మండపాల నిర్వాహకులు,

## ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అంకం కరుణ

**జన్నారం,సెప్టెంబర్ 12 (వుదయం విలేఖరి)**

మండలంలోని అక్కపెల్లిగూడ ప్రాథ మిక పాఠశాలలో ఎస్జిటీ గా విధులు నిర్వహిస్తున్న అంకం కరుణ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అవార్డు అందుకున్నారు. మంచిర్యాల జిల్లా కలె క్టర్ దీపక్ కుమార్, అడిషనల్ కలెక్టర్, డీఈవో చంద్రయ్య, ఉన్నతాధికారుల చేతుల మీదుగా ఆమె అవార్డును స్వీ కరించారు. వినూత్న బోధన, డిజిటల్ తరగతులు చక్కగా నిర్వహిస్తున్నారు. అవార్డు పొందిన కరుణను మండల విద్యాధికారి బీ. రాజేందర్, కాంప్లెక్స్ ప్ర ధానోపాధ్యాయులు విజయ్ కుమార్, పి ఆర్ టి యు అధ్యక్ష, కార్యదర్శులు కట్ట రాజమౌళి, అనుముల రాజన్న అభినం దించారు.ఈ అవార్డు తనపై బాధ్యతను మరింత పెంచిందని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే తన ధ్యేయమని కరుణ అన్నారు

# గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ఉత్తమ వైద్య సేవలు అందించాలి

- సిరిపురంలో జూనియర్ కాలేజ్ ఐటిఐ, ఏఐటీసీ సెంటర్ నిర్మాణ పనులపై అధికారులకు దిశానిర్దేశం
- మధిర జూనియర్, డిగ్రీ కాలేజీ భవనాల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

**మధిర, సెప్టెంబరు,12, వుదయం, ప్రతినిధి:**

ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రతి రోగికి సకాలంలో నాణ్యమైన, వైద్య సేవలు అందేలా అధికారులు, వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.శనివారం మధిర పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, వైద్యులు, సిబ్బంది హాజరు, ఓపీ సేవలు, ల్యాబ్ పరీక్షలు, ఔషధాల లభ్యత, వార్డుల నిర్వహణ, రోగుల నమోదు విధానం, పారిశుద్ధ్య నిర్వహణ, పరిశుభ్రత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. చికిత్స పొందుతున్న రోగులు, బంధువులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్ వారికి అందుతున్న వైద్య సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే ప్రతి ఒక్కరికి నాణ్యమైన, ఉచిత వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులపై పూర్తి విశ్వాసంతో సేవలు పొందేలా వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని తెలిపారు.రోగులకి సకల సౌకర్యాలు ఉండాలని మధిర హాస్పిటల్లో అన్ని వైద్య సేవలు దొరుకుతాయనే విశ్వాసాన్ని నమ్మకాన్ని మధిర ప్రజలకే కాకుండా చుట్టుపక్కల నియోజకవర్గం ప్రజలకి కల్పించాలని అన్నారు.ఆసుపత్రి పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్య సదుపాయాలు,ఇతర మౌలిక వసతులు మెరుగ్గా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికి సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత అధికారులదేనని కలెక్టర్ స్పష్టం చేశారు.అత్యవసర మెడిసిన్ తో పాటు సాధారణంగా వినియోగించే అన్ని రకాల ఔషధాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా పటిష్టమైన నిల్వల నిర్వహణ చేపట్టాలని సూచించారు. మందుల కొరత కారణంగా ఒక్క రోగి కూడా ఇబ్బంది పడకుండా ముందస్తు ప్రణాళికతో అవసరమైన స్టాక్‌ను నిర్వహించాలని తెలిపారు.గ్రామీణ ప్రాంత ప్రజలు ఎక్కువగా ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలపైనే ఆధారపడుతున్న నేపథ్యంలో, ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే అన్ని రకాల నాణ్యమైన వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ తెలిపారు. ఆ లక్ష్య సాధనలో ప్రతి వైద్యుడు, ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.వాతావరణం పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సీజనల్ వ్యాధులు, దోమల ద్వారా వ్యాపించే జ్వరాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల్లో పరిశుభ్రతపై విస్తృత అవగాహన కల్పించడంతో పాటు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మధిర మండలం కేంద్రంలో నూతనంగా మూడు కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కాలేజ్, నాలుగు కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ అదనపు భవనం నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.మధిర మండలంలోని సిరిపురం గ్రామంలో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవనం నిర్మాణ పనులు, అలాగే ఐటిఐ భవనం, ఏఐటీసీ సెంటర్ నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. గుర్తించిన ప్రాధాన్యత





పనులు త్వరితగతిన నాణ్యత తో పూర్తి చేయాలని, సమస్యలుంటే పై అధికారుల దృష్టికి తేవాలని, జిల్లా యంత్రాంగం పనుల పూర్తిలో పూర్తి సహకారం అందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మధిర తహసీల్దారు రాంబాబు, విద్యశాఖ ఇంజనీరింగ్ అధికారి బుగ్గయ్య,సంబంధిత అధికారులు, వైద్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌లో ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థులు మృతి

**సెలవు రోజు మిత్రుడిని కలిసేందుకు వెళ్లగా విషాదం**

**మునగాల, సెప్టెంబర్ 12 (వుదయం):**

సెలవు రోజు మిత్రుడిని కలిసేందుకు వచ్చిన ఇద్దరు తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఈత సరదా విషాదాన్ని మిగిల్చింది. మునగాల మండలం ముకుందాపురం గ్రామంలోని ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌లో శనివారం ఇద్దరు విద్యార్థులు నీటిలో గల్లంతై మృతిచెందిన విషాద ఘటన చోటుచేసుకుంది. రెండో శనివారం సెలవు కావడంతో కోదాడ పట్టణానికి చెందిన హరీష్ నాయుడు, గుడిబండ గ్రామానికి చెందిన లేకస్వరూప్ తమ తోటి విద్యార్థి, మిత్రుడు అనుదీప్‌ను కలిసేందుకు ముకుందాపురం వచ్చారు. అనంతరం ముగ్గురూ కలిసి ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ వద్దకు వెళ్లి ఈత కొట్టేందుకు కాలువలోకి దిగారు. కొద్దిసేపటికే హరీష్ నాయుడు, లేకస్వరూప్ ప్రమాదవశాత్తు లోతైన నీటిలో గల్లంతయ్యారు. అనుదీప్‌ను గమనించిన స్థానికులు వెంటనే స్పందించి అతడిని సురక్షితంగా బయటకు తీశారు. విద్యార్థులు గల్లంతైన సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిస్థితిని పరిశీలించి గాలింపు చర్యలు ప్రారంభించారు. విద్యార్థుల ఆచూకీ కోసం కాలువ నీటి మట్టాన్ని తగ్గిస్తూ రెస్క్యూ బృందాలు, పోలీసులు, స్థానిక గ్రామస్తులు కలిసి ముమ్మరంగా గాలించారు. సుమారు నాలుగు గంటల పాటు తీవ్రంగా శ్రమించిన అనంతరం ఇద్దరు విద్యార్థుల మృతదేహాలను గుర్తించి నీటి నుంచి బయటకు తీశారు. అనంతరం మృతదేహాలను ఆసుపత్రికి తరలించారు.





**శోకసముద్రంలో తల్లిదండ్రులు**

మిత్రుడిని కలిసేందుకు వెళ్లిన తమ పిల్లలు ఇక తిరిగి రారని తెలియడంతో తల్లిదండ్రుల గుండెలు పగిలేలా రోదించారు. ఉదయం నవ్వుతూ ఇంటి నుంచి వెళ్లిన బిడ్డలు సాయంత్రానికి విగతజీవులుగా తిరిగి రావడంతో కుటుంబ సభ్యుల రోదనలు ముకుందాపురం పరిసరాలను కలచివేశాయి. తమ పిల్లల భవిష్యత్తుపై ఎన్నో కలలు కన్న తల్లిదండ్రులకు ఈ విషాదం తీరని శోకాన్ని మిగిల్చింది. చిన్న వయసులోనే ఇద్దరు విద్యార్థులు మృత్యువాత పడటంతో వారి కుటుంబాల్లో విషాదం నెలకొంది. తోటి విద్యార్థులు, మిత్రులు కన్నీరుమున్నీరుగా విలపించగా, గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనతో కెనాల్ పరిసరాల్లో భద్రతా చర్యలపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.

# సత్తుపల్లి మండల క్రీడల్లో వి.వి. విద్యాలయం, వాణి విద్యాలయం విద్యార్థుల ప్రతిభ

**సత్తుపల్లి సెప్టెంబర్ 12 (వు దయం ప్రతినిధి )**

సత్తుపల్లి మండల స్థాయి క్రీడా పోటీలు సదాశివునిపేటలో నిర్వహించగా, సత్తుపల్లి వి.వి. విద్యాలయం మరియు వాణి విద్యాలయం పాఠశాలల విద్యార్థులు కబడ్డీ, ఖో–ఖో మరియు అథ్లెటిక్స్ విభాగాల్లో విశేష ప్రతిభ కనబరిచి పలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించారు.



కబడ్డీ మరియు ఖో–ఖో
సీనియర్ బాలుర కబడ్డీ జట్టు – ప్రథమ స్థానం
సీనియర్ బాలుర ఖో–ఖో జట్టు – ప్రథమ స్థానం
జూనియర్ బాలుర ఖో–ఖో జట్టు – ద్వితీయ స్థానం
సీనియర్ బాలికల ఖో–ఖో జట్టు – ప్రథమ స్థానం
అథ్లెటిక్స్ విభాగం
100 మీటర్ల పరుగు:
అండర్–14 బాలికల విభాగంలో శ్రీజ – ద్వితీయ స్థానం
జూనియర్ బాలికల విభాగంలో శ్రీ తేజు – ద్వితీయ స్థానం
సీనియర్ బాలికల విభాగంలో పవిత్ర – ద్వితీయ స్థానం
జూనియర్ బాలికల లాంగ్ జంప్:
శ్రీ తేజు – తృతీయ స్థానం
400 మీటర్ల పరుగు – బాలురు:
రిషి (8వ తరగతి) – ప్రథమ స్థానం
నాగ కీర్తన్ (8వ తరగతి) – ద్వితీయ స్థానం
సీనియర్ బాలుర లాంగ్ జంప్:
రిషి (9వ తరగతి–A) – ప్రథమ స్థానం
సీనియర్ బాలికల షాట్‌పుట్:
జె. పవాని – ద్వితీయ స్థానం
పి. తేజస్విని – తృతీయ స్థానం
సీనియర్ బాలికల డిస్కస్ త్రో:
పి. తేజస్విని – తృతీయ స్థానం
సీనియర్ బాలుర షాట్‌పుట్:
ఫరూక్ (10వ తరగతి) – తృతీయ స్థానం
సీనియర్ బాలుర డిస్కస్ త్రో:
ఫరూక్ (10వ తరగతి) – తృతీయ స్థానం

విద్యార్థులు మండల స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావడం పట్ల పాఠశాల యాజమాన్యం, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. విజయం సాధించిన విద్యార్థులను అభినందిస్తూ, భవిష్యత్తులో జిల్లా మరియు రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా మరింత ఉన్నత స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. వి.వి. విద్యాలయం & వాణి విద్యాలయం, సాతుపల్లి "విద్యతో పాటు క్రీడల్లోనూ అత్యుత్తమ ప్రతిభే మా లక్ష్యం అన్నారు.



# ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా బ్లీచింగ్

**మునగాల, సెప్టెంబర్ 12 (వుదయం):**

గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా శనివారం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో బ్లీచింగ్ పౌడర్ చల్లే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధులు, కాలనీలు, మురుగునీరు నిలిచే ప్రాంతాలు, ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉంచడమే గ్రామపంచాయతీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగానే బ్లీచింగ్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు గ్రామపంచాయతీ చేపడుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



# పంజా విసిరిన మైనింగ్ శాఖ అధికారులు

**అక్రమ తవ్వకాలపై ఉక్కుపాదం**

**చిలుకూరు సెప్టెంబర్ 12:( వుదయం )**

సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గంలో అక్రమంగా గ్రావెల్, ఇసుక తవ్వకాలకు పాల్పడుతున్న వారిపై మైనింగ్ శాఖ అధికారులు కఠిన చర్యలకు శ్రీకారం చుట్టారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మైనింగ్ ఏ.డీ. రఘు బాబు ఆధ్వర్యంలో అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న ఒక వాహనాన్ని అధికారులు సీజ్ చేసి మైహోమ్‌కు తరలించారు.అనుమతులు లేకుండా గ్రావెల్, ఇసుక తవ్వకాలు చేపట్టినా, అక్రమంగా తరలించినా చట్టపరమైన చర్యలు తప్పవని మైనింగ్ శాఖ అధికారులు హెచ్చరించారు.అక్రమంగా గ్రావెల్ కానీ, ఇసుక కానీ తవ్వకాలు జరిపితే చట్టపరంగా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం" అని అధికారులు స్పష్టం చేశారు. అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేసేందుకు తనిఖీలు, నిఘా మరింత ముమ్మరం చేస్తామని అధికారులు తెలిపారు.



# యువత గళానికి అండగా..

**యాదాద్రి భువనగిరి జిల్లా, 12 సెప్టెంబర్ 2026**

పాలిటెక్నిక్ ఫీజు రీయింబర్స్మెంట్ మరియు హోమియోపతి విద్యార్థుల సమస్యలపై పోరాడి అరెస్టై విడుదలైన BJYM నేతలను పరామర్శించి, వారి పోరాట స్ఫూర్తిని అభినందిస్తున్న బీజేపీ అధికార ప్రతినిధి, MBC కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ తాడూరి శ్రీనివాస్.

# వెంకటేశ్వరస్వామి ఆలయంలో అన్నదానం

**మునగాల సెప్టెంబర్ 12 (వుదయం):**

కోదాడ పట్టణానికి చెందిన కీర్తిశేషులు ఎర్ర వెంకటనారాయణ గారి జ్ఞాపకార్థం బరకత్‌గూడెం గ్రామంలోని శ్రీ స్వయంభు వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వెంకటనారాయణ గారి ధర్మపత్ని ఎర్ర భారతమ్మ, వారి కుమారులు శ్రీనివాసరావు–జ్యోతి దంపతులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించి సుమారు 200 మంది భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్నప్రసాదం అందించారు. కీర్తిశేషులు ఎర్ర వెంకటనారాయణ గారి జ్ఞాపకార్థం అన్నదానం నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ పోలిశెట్టి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాలే సామేలు, దేవరం నర్సిరెడ్డి, బొంతు వెంకటేశ్వరరావు, ఇనుగుర్తి వీరాచారి, ఆలయ అర్చకులు కందాల శ్రీనివాసాచార్యులు, నరాల వెంకటేశ్వరరావు, బొల్లెద్దు వెంకటేశ్వర్లు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# రాజీ పడితే ఇరువర్గాలకూ విజయమే!

- పంతాలకు పోకుండా సామరస్యంతో సమస్యలు పరిష్కరించుకోవాలి
- కక్షిదారులకు ఎస్ఐ సంజీవరెడ్డి సూచన

**మునగాల, సెప్టెంబర్ 12 (వుదయం):**

కోర్టుల్లో కొనసాగుతున్న వివాదాలు, కేసులను కక్షలు, పట్టుదలతో మరింత జటిలం చేసుకోకుండా పరస్పర అవగాహనతో రాజీ పడటం ద్వారా ఇరువర్గాలూ విజయం సాధించినట్టేనని మునగాల ఎస్ఐ సంజీవరెడ్డి అన్నారు. శనివారం కోదాడ కోర్టు ప్రాంగణంలో కక్షిదారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. చిన్న వివాదాల కారణంగా ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగడం వల్ల సమయం, డబ్బు, శ్రమ వృథా అవుతాయని తెలిపారు. కక్షలు పెంచుకోవడం వల్ల కుటుంబ సంబంధాలు దెబ్బతినడంతో పాటు కొత్త సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. చట్టపరంగా రాజీకి అవకాశం ఉన్న కేసుల్లో ఇరువర్గాలు పరస్పర చర్చలతో పరిష్కారానికి



రావాలని సూచించారు. రాజీ అనేది ఓటమి కాదని, ఇరువర్గాల మధ్య శాంతిని నెలకొల్పే బాధ్యతాయుతమైన నిర్ణయమని ఎస్ఐ పేర్కొన్నారు. కక్షలు, ప్రతీకారాలు సమస్యలకు పరిష్కారం కాదని, చర్చ, అవగాహన, పరస్పర గౌరవంతోనే శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.

# ప్రశాంతంగా వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించాలి

**ఎస్ఐ సంపత్**

**గట్టుప్పల్, సెప్టెంబర్ 12(వుదయం):**

గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని గట్టుప్పల్ ఎస్ఐ సంపత్ పిలుపునిచ్చారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో శనివారం గణేష్ మండపాల నిర్వాహకులతో ఆయన ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ సంపత్ మాట్లాడుతూ... మండపాల ఏర్పాటు, ఉత్సవాల నిర్వహణకు సంబంధించి నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. పోలీసుల అనుమతితో పాటు విద్యుత్ భద్రత విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, శబ్ద కాలుష్య నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు.విగ్రహాల ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జన ఊరేగింపు వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రజలు,



వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉత్సవాలను విజయవంతం చేయడానికి నిర్వాహకులు పోలీసు శాఖకు పూర్తిస్థాయిలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో పలువురు పోలీస్ సిబ్బందితో పాటు మండలంలోని వివిధ గణేష్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

# వినాయక చవితి పండుగ సందర్భంగా సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి రద్దు

**సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ**

**భద్రాచలం 12 సెప్టెంబర్ 26 వుదయం ప్రతినిధి**

వినాయక చవితి పండుగను పురస్కరించుకొని ఈ నెల 14వ తేదీ సోమవారం భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణంగా ప్రతి సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి భద్రాచలం రెవెన్యూ డివిజన్ పరిధిలోని వివిధ మండలాలు, గ్రామాలు, పట్టణ ప్రాంతాల నుంచి ప్రజలు హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తుంటారు. భూ సమస్యలు, రెవెన్యూ సంబంధిత అంశాలు, పట్టాదారు పాస్ పుస్తకాలు, భూ రికార్డుల సవరణలు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమస్యలు, వివిధ ధ్రువపత్రాలు, ప్రజా సమస్యలు, వ్యక్తిగత మరియు సామాజిక సమస్యలపై ప్రజలు ప్రజావాణి ద్వారా దరఖాస్తులను సమర్పిస్తుంటారు. ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు పంపించి, సమస్యలను పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుంది.



అయితే ఈ నెల 14వ తేదీన వినాయక చవితి పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవు దినం ఉన్నందున ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం సాధ్యం కానందున ఆ రోజు కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ తెలిపారు.

# క్లోరోక్విన్ టాబ్లెట్లతో అస్వస్థతకు గురైన బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే, అరకు ఎంపీ

- బాధితులకు ప్రభుత్వం తక్షణమే మెరుగైన వైద్యం, ఆర్థిక సహాయం అందించాలి
- ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి లేనిపక్షంలో భారీ ఆందోళన, రాస్తారోకో చేపడతాం

**భద్రాచలం,**
**ఎటపాక 12 సెప్టెంబర్ 26 వుదయం ప్రతినిధి:**

ఎటపాక మండలం గొల్లగుప్ప గ్రామంలో క్లోరోక్విన్ టాబ్లెట్లు తీసుకోవడం వల్ల అస్వస్థతకు గురైన బాధిత కుటుంబాలను అరకు ఎంపీ డాక్టర్ తనూజ రాణి, మాజీ ఎమ్మెల్యే, రంపచోడవరం నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నాగులపల్లి ధనలక్ష్మి శనివారం పరామర్శించారు. ఎటపాక మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గొల్లగుప్ప గ్రామానికి చేరుకున్న వారు బాధిత కుటుంబాలను స్వయంగా కలిసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ఎదురైన ఇబ్బందులు, ప్రస్తుతం అందుతున్న వైద్య సేవలు, ప్రభుత్వ పరంగా అందుతున్న సహాయంపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు తమ పార్టీ అండగా ఉంటుందని, అవసరమైన సమయంలో వారికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని వారు భరోసా కల్పించారు. అనంతరం అరకు ఎంపీ డాక్టర్ తనూజ రాణి, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ గొల్లగుప్ప గ్రామంలో క్లోరోక్విన్ టాబ్లెట్ల కారణంగా పలువురు అస్వస్థతకు గురైన ఘటన అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ప్రభుత్వ యంత్రాంగం ముందస్తు జాగ్రత్తలు తీసుకుని ఉంటే ఇటువంటి ఘటన చోటుచేసుకునే పరిస్థితి ఉండేది కాదని వారు ఆరోపించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి అసలు కారణాలను వెలుగులోకి తీసుకురావాలని, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు, వారి కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ముఖ్యంగా ఈ ఘటనలో మృతిచెందిన చిన్నారి కుటుంబం తీవ్ర విషాదంలో ఉందని, ఆ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాల్సిన బాధ్యత ఉందని అన్నారు. మృతి చెందిన పాప కుటుంబానికి పెద్ద మొత్తంలో ఎక్స్‌గ్రేషియాను ప్రకటించి, కుటుంబానికి తగిన భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అరకు ఎంపీ డాక్టర్



తనూజ రాణి పేర్కొన్నారు. లక్ష్మీపురం పీహెచ్‌సీ సెంటర్‌కు ఒక అంబులెన్స్‌ను ఏర్పాటు చేసేందుకు ఎంపీ నిధుల నుంచి నిధులు మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటానని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎటపాక మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆకుల వెంకట రామారావు, గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి, ఎంపీపీ కాకా మేశ్వరి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు దామెర రేవతి, మండల మహిళా అధ్యక్షురాలు గుడిమల్ల నాగలక్ష్మి , యువజన విభాగం మండల అధ్యక్షుడు తోట శశికుమార్, మండల ప్రధాన కార్యదర్శి ఆకుల దయాకర్, పబ్లిసిటీ విభాగం మండల అధ్యక్షుడు ముత్తిబోయిన రాము, ఎంపీటీసీ బూరం అంజలి, మండల కార్యదర్శి ముక్కు కల్పన, సీనియర్ నాయకులు రంభాల నాగేశ్వరరావు, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు చిచ్చడి రామారావు, సర్పంచ్ లక్ష్మణ్, స్టూడెంట్ వింగ్ విభాగం అధ్యక్షుడు మైసాక్షి రాకేష్, గజ్జల శ్రీనివాస్, బత్తుల మహేష్‌తో పాటు ఎటపాక మండలానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాల్లో పోలీసుల సూచనలు పాటించాలి

**సిఐ రమేష్**

**మధిర, సెప్టెంబర్ 12, వుదయం , ప్రతినిధి :**

గణేష్ నవరాత్రుల సందర్భంగా గణేష్ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించాలని మధిర టౌన్ సీఐ రమేష్ సూచించారు. ఖమ్మం జిల్లా పోలీస్ కమిషనర్ సునీల్ దత్తు ఆదేశాల మేరకు శుక్రవారం మధిర టౌన్ పోలీస్ స్టేషన్‌లో గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ రమేష్ మాట్లాడుతూ గణేష్ విగ్రహాల ప్రతిష్ఠాపన, నిమజ్జనం తదితర కార్యక్రమాల్లో పోలీసుల సూచనలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. ఉత్సవాల సందర్భంగా డీజేలకు ఎటువంటి అనుమతి లేదని, నిబంధనలను అతిక్రమించి డీజేలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు పోలీసులకు సహకరిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగ



కుండా భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు నవిత, కిషోర్‌తో పాటు గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

# సీతారాం ఏచూరి ఆశయ మార్గంలో పయనిద్దాం

**గట్టుప్పల్ , సెప్టెంబర్ 12 (వుదయం):**

సీపీఐ(ఎం) మాజీ ప్రధాన కార్యదర్శి, ప్రజా ఉద్యమాల స్ఫూర్తిదాత కామ్రేడ్ సీతారాం ఏచూరి ద్వితీయ వర్ధంతి సందర్భంగా గట్టుప్పల్ మండల కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు.అనంతరం సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు చాపల మారయ్య మాట్లాడుతూ... సీతారాం ఏచూరి జీవితాంతం కార్మికులు, కర్షకులు, పేద ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడారని కొనియాడారు. దేశంలో లౌకికవాదం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయ పరిరక్షణ కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. మతోన్మాదం, కార్పొరేట్ అనుకూల విధానాలపై విశాల ప్రజా ఐక్యతను నిర్మించడంలో ఏచూరి కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు.ప్రజా సమస్యలపై పోరాటాలను మరింత ఉధృతం చేయడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పిలుపునిచ్చారు. ఏచూరి చూపిన మార్గంలో పయనిస్తూ ప్రజాస్వామ్య



పరిరక్షణకు ఐక్యంగా ఉద్యమించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు కర్నాటి సుధాకర్, ఖమ్మం రాములు, కర్నాటి వెంకటేశం, వల్లూరి శ్రీశైలం, రావుల నరసింహ, పెద్దగాని నరసింహ, భీమనపల్లి కనకయ్యతో పాటు సీనియర్ నాయకులు ముసుకు బుచ్చిరెడ్డి, పసుపుల చెన్నయ్య, నల్లవెల్లి బిక్షం, బోయపల్లి పుల్లయ్య, రేవెల్లి సైదులు, బుచ్చయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎండుతున్న చేలు.. ఆగుతున్న ఊపిరులు

- చండూరు మండలంలో రైతాంగం కన్నీటిపాట..
- కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్

**చండూరు, సెప్టెంబర్ 12 (వుదయం):**

పంటలు పండక, అప్పుల బాధ తాళలేక చండూరు మండలంలో ఇద్దరు రైతులు వారం వ్యవధిలోనే ఆత్మహత్యలకు పాల్పడటం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ వరుస ఘటనలతో మండల రైతుల్లో తీవ్ర ఆందోళన, దిగ్భ్రాంతి నెలకొన్నాయి. ఎల్‌నినో ప్రభావంతో వర్షాకాలం ఆరంభం నుంచే సకాలంలో వర్షాలు కురవకపోవడంతో వేసిన పంటలన్నీ ఎండిపోయి తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట పెట్టుబడుల కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేకనే రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారని కన్నీటి పర్యంతమయ్యారు.పంట నష్టపోయి ఆర్థికంగా చితికిపోయిన రైతు కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, వారికి తగిన బీమా పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. వెంటనే చండూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి, నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని అధికారులకు, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.



